# రూ.లక్షల్లో ఫీజులు...

# ఇష్టారాజ్యంగా నిర్ణయాలు

**-తల్లిదండ్రుల ఆశలను సొమ్ము చేసుకుంటున్న యాజమాన్యాలు**

**-ఒక్కో విద్యార్థికి ఏడాదికి మూడున్నర లక్షల వరకు వసూళ్లు**

**-పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం**



**హైదరాబాద్, మే 23 ప్రభాతవార్త**

జనగాం జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లో ఓ ప్రైవేటు స్కూల్‌లో 10వ తరగతిలో మంచి ర్యాంకుతో ఉత్తీర్ణుడైన కుశలు అనే విద్యారికి ఇంటర్మీడియట్‌లో చేర్చేందుకు విద్యార్థి తల్లిదండ్రులు మాదాపూర్‌లోని ఓ కార్పొరేట్ కాలేజీని (రెసిడెన్షియల్) సంప్రదించారు. ఏడాదికి రూ.3.50లక్షల ఫీజు అని చెప్పడంతో నోరెళ్లబెట్టాడు. చేసేధేంలేక నగర శివారు ప్రాంతంలోని మరో కార్పొరేటర్ యాజమాన్యానికి చెందిన కాలేజీలో సంప్రదించారు. అక్కడ ఏడాదికి ఫస్ట్‌ఇయర్‌కు రూ.2.40లక్షలు, సెకండియర్‌కు రూ.2.60లక్షలు..ఈ ఫీజుకు ఓకే అంటే సీటు ఇస్తామని చెప్పడంతో అవాక్కయ్యారు...ఇది నగరంలో కార్పొరేట్, ప్రముఖ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో అడ్డగోలుగా వసూలు చేస్తున్న ఫీజుల బాగోతం. లక్షల కొద్దీ ఫీజులు కట్టడం కోసం సతమతం అవుతున్న తల్లిదండ్రుల ఆందోళన.. పదో తరగతి పూర్తిఅయిన విద్యార్థులు ఇంటర్మీడియట్ అడ్మిషన్ల కోసం నగరానికి పరుగెడుతున్నారు. అయితే కార్పొరేట్ కాలేజీల్లో సీట్లు అయిపోతున్నాయంటూ తల్లిదండ్రులను ఆందోళనలోకి నెట్టేసి అధిక ఫీజులను దండుకుంటున్నాయి. ఫలానా కాలేజీలోని, ఫలానా బ్రాంచీలో ఇంటర్మీడియట్ చదివిస్తే జెఇఇలో, ఎంసెట్‌లో మంచి ర్యాంకులు వస్తాయని..తద్వారా బిటెక్ సీటు మంచి కాలేజీలో వస్తుందన్న ఆశతో తల్లిదండ్రులు తమ పిల్లలను కార్పొరేట్, ప్రముఖ ప్రైవేటు కాలేజీల్లో చేర్పేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇంటర్ బోర్డు నిర్ణీత ఫీజుల విధానాన్ని పట్టించుకోవడం లేదు. దీంతో ప్రైవేటు యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నాయి.కార్పొరేట్ కాలేజీలు హాస్టల్ వసతి కలుపుకొని రూ.3.50లక్షల నుంచి రూ.2.60లక్షల వరకు తీసుకుంటున్నాయి. నోటికీ వచ్చిందే ఫీజు అన్నట్లుగా అడ్డగోలుగా నిర్ణయించి రూ.10,500లు అడ్వాన్స్‌గా తీసుకొని రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నాయి. ఆయా కాలేజీల్లో చదివిస్తే తమ పిల్లలకు మంచి చదువు వస్తుందని, మంచి ర్యాంకు వస్తుందన్న ఆశలతో తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ అడిగినంత ఫీజు చెల్లిస్తున్నారు.

మరోవైపు నగరానికి చెందిన కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేయగా, మరికొన్ని ప్రైవేటు కాలేజీ అడ్మిషన్లు కోసం విద్యార్థుల వివరాలు సేకరించి వారి తల్లిదండ్రులకు ఫోన్లుచేసి బంగారు భవిష్యత్తు అందిస్తామంటూ ప్రలోభాలకు గురి చేస్తున్నాయి. ఒక్కసారి కాలేజీని సందర్శించంటూ పదే పదే ఫోన్లు చేయించడం మామూలుగా మారింది.ఎంసెట్, జెఇఇ, నీట్ విద్యార్థుల కోసం కళాశాలలు ఏజెంట్లను కూడా నియమించుకుని వారి ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులను ఫోన్లలో సంప్రదించడం, కలవడం, అడ్మిషన్లు బుక్ చేసుకోవడం లాంటి కార్యకలాపాలు ప్రారంభించాయి. తమ విద్యాసంస్థలో ముందుగా చేరితే ఫీజులో రాయితీ ఇస్తామంటూ ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. అయితే ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల కోసం వరుసగా వస్తున్న ఫోన్లు, ఎస్ఎంఎస్‌లతో తల్లిదండ్రులు విస్తుపోతున్నారు. అయితే ప్రతిఏటా నగరంలో వేల సంఖ్యలో విద్యార్థులు కార్పొరేట్ విద్యాసంస్థలో చదువుకుంటుండగా.. మళ్లీ తల్లిదండ్రులు తమ పిల్లలను కార్పొరేట్ కళాశాలల్లో చేర్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఒక్కసారి కాలేజీని సందర్శించండంటూ పదే పదే టెలికాలర్స్ ద్వారా ఫోన్లు చేయించడం మామూలుగా మారింది. ఈ నేపథ్యంలో తల్లిదండ్రుల ఆశలను సొమ్ము చేసుకుంటున్న యాజమాన్యాలను చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



## హైదరాబాద్ వార్త

# బేగంపేట లో ట్రాఫిక్ జంజాటం

**-పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు**

**-వివిఐపిల రాకపోకలు ఉన్నా**

**ప్రధాన రోడ్లు,ఫుట్‌ఫాత్‌లు ఆక్రమించి పార్కింగ్**



రసూల్‌పురా జంక్షన్ లో నోపార్కింగ్ వద్ద పార్కింగ్ చేసిన వాహనాలు.



శ్యాంలాల్ బిల్డింగ్ వద్ద ఓ వైన్స్ ముందు సాయంత్రం సమయంలో నిల్చిపోయిన వాహనాలు.

**బేగంపేట మే 23,ప్రభాతవార్త**

బేగంపేట మార్గం అంటే వివిఐపీలు నిత్యం రాకపోకలు సాగించే ప్రాంతం. ఇలాంటి ప్రాంతంలో యదేశ్చగా వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేస్తున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల సందర్భంగా బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న వివిఐపీలు బేగంపేట మీదుగా ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించారు.ఈ మార్గంలో నిత్యం ముఖ్యమంత్రి మంత్రులు రాకపోకలు సాగిస్తుంటారు. వీవీఐపీలు రాకపోకలు సాగించే రోడ్డు అంటే భద్రత పరంగా ఎంతో అలర్ట్‌గా ఉండాలి.అయినా బేగంపేట రోడ్లపైన మాత్రం అలాంటి బద్రత మచ్చుకైనా కన్పించడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.కొన్ని హోటల్స్,దుకాణాలు ,ప్రయివేటు ఆస్పత్రులు,వైన్స్‌లు తమ వద్దకు వచ్చిన వారి వాహనాలను రోడ్డుపైన పార్కింగ్ చేస్తున్నా సంబంధిత ట్రాఫిక్ అధికారులు,జీహెచ్ఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తుంది.చిన్న పాటి వర్షం కురిస్తే బేగంపేట ప్రధాన రోడ్డులోని ఐబీపీ పెట్రోలు పంపు ముందు భారీ ఎత్తున వరద నీరు వచ్చి చేరుతుంది.ఇదే ప్రాంతంలో ఫ్లై ఓవర్ కూడా ఉండటంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ నిల్చిపోతుంది.ప్రతి రోజు ఉదయం సికింద్రాబాద్ వైపు నుంచి పంజాగుట్ట,మాదాపూర్,హైటెక్ సిటీ వైపుకు 10 నుంచి 14లక్షల వరకు వాహనాలు బేగంపేట మీదుగా ప్రయాణిస్తుంటాయి.తిరిగి సాయంత్రం పంజాగుట్ట నుంచి సికింద్రాబాద్ వైపు అదే స్థాయిలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి.ఇలాంటి రద్దీ ప్రాంతమైన బేగంపేట రసూల్‌పురా జంక్షన్ తో పాటు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నో పార్కింగ్ బోర్డులు ఉన్న ప్రాంతంలోనే అధిక సంఖ్యలో వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు.అదే విధంగా బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్ లోకి వెళ్లే చోట ఓ వైన్‌షాపు,ప్రధాన రోడ్డుపైన ఉన్న మరో రెండు వైన్‌షాపులు,ప్రకాష్‌నగర్ బస్టాప్ పక్కనే ఓ ప్రయివేటు ఆస్పత్రి ఫుట్‌ఫాత్‌ను ఆక్రమించి వాహనాల పార్కింగ్ చేస్తుంది.ప్యారడైజ్ హోటల్ ముందు రోడ్డును ఆక్రమించి పార్కింగ్ చేస్తున్నారు.మినిస్టర్ రోడ్డులో ఉన్న కార్ డెకార్స్ షాపులు ఫుట్‌ఫాత్‌తో పాటు మినిస్టర్ రోడ్డును సైతం ఆక్రమించడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఇదే రోడ్డులో ఉన్న మరో ప్రయివేటు ఆస్పత్రి ముందు రోడ్డుకు రెండు వైపులా బారులు తీరి వాహనాలను నిలిపి ఉంచుతున్నారు.ఫుట్‌ఫాత్‌లు కబ్జా చేసి మరికొందరు ఫుడ్‌స్టాల్స్ ను ఏర్పాటు చేస్తుండటంతో వారి వద్ద తినేందుకు వచ్చిన వారు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు.ఇక వీటికి తోడు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ముందు మొదలు కొని విమానాశ్రయం ముందు వరకు తోపుడు బండ్లు యదేశ్చగా రోడ్లను ఆక్రమించడంతో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది.గతంలో మినిస్టర్ రోడ్డులో పర్యటించిన సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మినిస్టర్ రోడ్డులో రోడ్డును ఆక్రమించిన దుకాణ దారులకు నోటీసులు ఇవ్వాలని,వారు వాహనాలు రోడ్లపై పెట్టకుండా చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ అధికారులకు సూచించారు.అయినా అధికారులు మాత్రం పట్టించుకోకపోవడంతో వారు వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు.ఇక చిన్న పాటి వర్షం వస్తే ఈ మార్గంలో వెళ్లాలంటే నరకంగా ఉందని,వాహనదారులు వాపోతున్నారు.ఇక యూటర్న్‌లు కూడా గతంలో ఉన్న వాటిని తొలగించి మరింత దూరంలో ఏర్పాటు చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.ట్రాఫిక్ పోలీసుల చర్యల వల్ల పెట్రోలు అధికంగా ఖర్చు కావడంతో పాటు అధిక సమయం పడుతుందని వాపోతున్నారు. కొందరు ట్రాఫిక్ సిబ్బందే ఫుట్‌ఫాత్‌లపై దందాలను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.ముఖ్యంగా ప్యారడైజ్ సమీపంలోని ఓ పిజ్జా హౌస్ తో పాటు కొన్ని హోటల్స్,హాస్పిటల్స్,మద్యం దుకాణాలు,ఇలా ఒకటేమిటి నో ఎంట్రీ సమయంలో వస్తున్న బస్సులు,లారీలు,ఇతర రాష్ట్రాలకు రాకపోకలు సాగించే బస్సులు ట్రాఫిక్ సిబ్బందికి వరంగా మారాయన్న ఆరోపణలున్నాయి. ట్రాఫిక్ ఉన్నతాధికారులు బేగంపేట ట్రాఫిక్‌పైన దృష్టి సారించకుంటే ఈ మార్గంలో రాకపోకలు సాగించడం కష్టతరంగా మారుతుందని వాహనదారులు వాపోతున్నారు.

**పెనాల్టీ వసూళ్లకే పరిమితమవుతున్న ట్రాఫిక్ పోలీసులు.?**

బేగంపేట లో యదేశ్చగా రోడ్లను ఆక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తున్నా ట్రాఫిక్ అధికారులు,జీహెచ్ఎంసీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇదే సమయంలో ట్రాఫిక్ పోలీసులు ఛలాన్లు (పెనాల్టీ వసూళ్ల)కే పరిమిత మవుతున్నారన్న విమర్శలున్నాయి.వాహనదారులకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా వారి ప్రయాణం సాఫీగా సాగేలా చూడాల్సిన ట్రాఫిక్ పోలీసులు కేవలం ఛలాన్లకే పరిమితమయ్యారన్న ఆరోపణలు జోరుగా విన్పిస్తున్నాయి.ఛలాన్లు విధించడంతో పాటు ఆయా వాహనాలపై ఉన్న పెండింగ్ ఛలాన్ల వసూళ్లకే పరిమితమయ్యారన్న ఆరోపణలు సైతం ఉన్నాయి.బాసుల మెప్పుకోసం నెలవారీ టార్గెట్లపైన దృష్టి సారించి మిగిలిన విషయాలను విస్మరించారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## అంబులెన్స్ డ్రైవర్లపై దాడి



దాడిలో గాయపడిన అంబులెన్స్ డ్రైవర్లు

**మన్సూరాబాద్, మే 23 ప్రభాతవార్త:**

ఎల్‌బినగర్ కామినేని చౌరస్తాలోని ఫ్లైఓవర్ క్రింద పార్కు చేస్తున్న అంబులెన్స్ డ్రైవర్లకు, అక్కడే సెకండ్ హ్యాండ్ కార్లు విక్రయించే యాజమాని కి మధ్య తలెత్తిన ఘర్షణ వివాదస్పదంగా మారిన సంఘటన ఎల్‌బినగర్ పోలీస్‌స్టేషన్ పరిదిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. కొన్ని సంవత్సరాలుగా ఎల్‌బినగర్ నుండి కామినేని చౌరస్తాకు వెళ్లే దారిలో ఉన్న ఫ్లైఓవర్ క్రింద ప్రైవేటు అంబులెన్స్‌డ్రైవర్లు తమ వాహనాలను పార్కు చేస్తున్నారు. అదే రహదారి ప్రక్కన న్యూ మల్టీ కార్స్ పేరుతో అయాన్‌ఖాన్ అనే వ్యక్తి సెకండ్ హ్యాండ్ కార్లను విక్రయిస్తున్నాడు. కాగా బుదవారం ఉదయం అయాన్‌ఖాన్ తన కారులో వచ్చి అంబులెన్స్‌లు తమ పార్కింగ్‌లోనికి వెళ్లె దారి ప్రక్కన ఆపి ఫోన్ మాట్లాడుతున్నాడు. ఇంతలో అక్కడే ఉన్న రవి అనే అంబులెన్స్ డ్రైవర్ వచ్చి కారు తీసేయాలని అయాన్‌ఖాన్‌కు సూచించాడు. అయితే ఫోన్ మాట్లాడుతున్న అయాన్‌ఖాన్ ఇది గమనించకపోవడంతో కారును చేతితో గుద్ది కారు తీసేయాలని రవి చెప్పాడు.దీంతో కోపోద్రిక్తుడైన అయాన్‌ఖాన్ వెంటనే రవిని దూషించాడు.దీంతో ఇరువురి మద్య వాగ్వాదం తీవ్రస్థాయిలో జరిగింది. ఇరువురి మద్య తోపులాటలు తో పాటు పరుషపదుజాలంతో దూషించుకున్నారు. అనంతరం అయాన్‌ఖాన్ తన మిత్రులను సైతం పిలిపించి అక్కడే ఉన్న కర్రలు, పైపులతో అంబులెన్స్ డ్రైవర్లపై దాడికి దిగాడు. ఈ దాడిలో రవి చెయితో పాటు వీపు మీద బలమైన గాయాలు అయ్యాయి. వెంటనే డ్రైవర్లు పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి వచ్చిన పోలీసులు ఇరువురిని సర్ధిచెప్పి పంపించారు. కాగా ఈ ఘటనపై ఇరు వర్గాలు పిర్యాదులు స్వీకరించిన పోలీసులు అయాన్‌ఖాన్‌తో పాటు అతని అనుచరులపై మరియు అంబులెన్స్ డ్రైవర్లపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ ఘటనతో తాము వాహనాలను నడపలేమని తమపై దాడి చేసినవారిని కఠినంగా శిక్షించాలని అదే విదంగా తమపై దాడిచేసిన వారిని వదిలిపెట్టి తమపై కేసులు ఎందుకు పెట్టారో అర్థం కావడం లేదని తమకు న్యాయం చేయాలని అంబులెన్స్ డ్రైవర్లు ఎల్‌బినగర్ ఇన్‌స్పెక్టర్ రామాంజనేయులు వద్ద వాపోయారు.

## ఘనంగా అన్నమాచార్యుల జయంత్యుత్సవాలు



అన్నమయ్య గీతాలు ఆలపిస్తున్న పద్మశ్రీ డాక్టర్ శోభారాజు తదితరులు

**ముషీరాబాద్, మే 23, ప్రభాతవార్త:** తొలి తెలుగు వాగ్గేయకారుడు, పద కవితాపితామహుడు అయిన అన్నమాచార్యుల 616వ జయంతి ఉత్సవాలు పద్మశ్రీ డాక్టర్ శోభారాజు సారధ్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం చిక్కడపల్లి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శోభారాజు తన శిష్యబృందంతో కలసి అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తూ మహానగర సంకీర్తన చేస్తూ ట్యాంక్‌బండ్ మీద ఉన్న అన్నమయ్య విగ్రహం వద్దకు చేరుకున్నారు. అక్కడ పూజలు నిర్వహించిన అనంతరం శోభారాజు మరియు శిష్యబృందం చక్కటి అన్నమయ్య కీర్తనలు ఆలపించి, శ్రోతలను భక్తిపారవశ్యంలో ముంచెత్తారు. ఈ సందర్భంగా చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకులు శ్రీరంగరాజన్ మాట్లాడుతూ అన్నమయ్య తత్వాన్ని విశ్వవ్యాపితం చేస్తున్న శోభారాజు సేవలను కొనియాడారు. త్యాగరాజు ఆరాధనోత్సవాల లాగా అన్నమయ్య జయంతి ఉత్సవాలు కూడా ప్రతి చోటా వైభవంగా జరగాలని ఆకాంక్షించారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త డాక్టర్ అనంతలక్ష్మి మాట్లాడుతూ భక్తి ఎన్నిరకాలో వివరించి, అన్ని రకాలుగా అన్నమయ్య శ్రీవెంకటేశ్వరస్వామిని సేవించారని తెలిపారు. ప్రముఖ చిత్రకారుడు బ్నిమ్, విద్యావేత్త తిరునగరి జ్యోత్స్న ఈ కార్యక్రమాన్ని ఉద్దేసించి ప్రసంగించారు. వెంకటేశ్వరస్వామి వేషధారణలో సాందీప్, అన్నమయ్య వేషధారణలో మానస్ పటేల్ అందరినీ ఆకర్షించారు. ప్రముఖ నేపథ్య గాయనీమణులు మానసా ఆచార్య, గాయత్రి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని, గీతాలు ఆలపించారు.

## లంచం తీసుకుంటూ పట్టుబడ్డ టాక్స్‌ఇన్‌స్పెక్టర్

**-డబ్బులు ఇస్తేనే అసెస్మెంట్**



విచారణ జరుపుతున్నా ఏసీబీ అధికారులు

**ఎల్.బి.నగర్, మే 23 ప్రభాతవార్త:**

ఇంటి నెంబరు, అసెస్మెంట్ వ్యవహారానికి సంబంధించి లంచం తీసుకుంటూ టాక్స్ ఇన్స్పెక్టర్ ఏసీబీకి పట్టుబడ్డాడు. ఈ సంఘటన సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయంలో టాక్స్ ఇన్స్పెక్టర్ విజయ్‌భార్గవ్‌కృష్ణ(బిల్‌కలెక్టర్)ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు. రంగారెడ్డి జిల్లా రేంజ్ ఏసీబీ డిఎస్పి ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్మంఘాట్‌లో ఇల్లు నిర్మించుకున్న నరసింహారెడ్డి స్నేహితుడు ఇంటి నెంబరు, అసెస్మెంట్ ఆస్తి పన్నుకు సంబంధించి ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. మూడున్నర సంవత్సరాలకు సంబంధించి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోగా రూ. 67వేలు ఇంటిపన్ను వచ్చింది. జిహెచ్ఎంసి నిబంధనల ప్రకారం రూ.67వేలు చెల్లించారు. ఇంటి నంబరు, అసెస్మెంట్ సవరణ గురించి జిహెచ్ఎంసికి డబ్బులు చెల్లించినప్పటికీ జిహెచ్ఎంసి కార్యాలయం నుంచి ఎటువంటి సమాచారం రాలేదు. దీంతో నిర్మాణదారు స్నేహితుడు నరసింహారెడ్డి ఎల్బీనగర్ సర్కిల్ ట్యాక్స్ ఇన్స్పెక్టర్ విజయ్‌భార్గవ్‌కృష్ణను కలిశారు. అయితే రూ.10వేలు లంచం ఇస్తేనే పని అవుతుందని విజయ్‌భార్గవ్‌కృష్ణ చెప్పాడు. అందుకు నరసింహారెడ్డి తాను కూడా జిహెచ్ఎంసిలో ఏఎంసీగా పనిచేశానని నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు అడగడం ఏమిటని ప్రశ్నించాడు. అయినప్పటికీ టాక్స్ ఇన్స్పెక్టర్ వినకపోవడంతో ఏసీబీ అధికారులను సంప్రదించారు. గురువారం సాయంత్రం ఎల్బినగర్ సర్కిల్ కార్యాలయంలో రూ.10వేలు విజయ్‌భార్గవ్‌కృష్ణ తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రెడ్ హ్యాండెడ్గా పట్టుబడిన విజయ్‌భార్గవ్‌కృష్ణను అదుపులోకి తీసుకున్నామని, దీని వెనుక మరో ఎవరైనా ఉన్నారా అనే కోణంలో విచారణ జరుగుతున్నామని డిఎస్పి తెలిపారు.

## కుళ్ళిన కూరగాయల..పాడైపోయిన పండ్లు

**-వంటలకు నాసిరకం పదార్థాల వినియోగం -ప్రముఖ హోటళ్ల వంటగదుల్లోనూ దుర్వాసన**

**-ఫుడ్‌సేఫ్టీ అధికారుల దాడుల్లో వెలుగులోకి -కఠిన చర్యలు తీసుకోవాలని జనం డిమాండ్**



అల్వాల్‌లో తనిఖీచేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

**హైదరాబాద్, మే 23,ప్రభాతవార్త:** ప్రస్తుతం ఉన్న బిజీకాలంలో మనిషి ఆహారం ప్రత్యేక దృష్టి పెట్టలేకపోతున్నాడు.పార్టీలు, ఉద్యోగజీవితం, టైంపాస్ చేయడం వంటి అనేక కారణాల వల్ల బయటి ఆహారం తినడానికి చాలా మంది ఇష్టపడుతున్నారు. ముఖ్యంగా బిర్యానీలు, చికెన్ ,మటన్,ఫాస్ట్‌ఫుడ్, ఐస్‌క్రీంల కోసం పాకులాడుతున్నారు. కానీ బయటహోటళ్లు,రెస్టారెంట్లలో తినే ఆహారం ఏది కల్తీనో..ఏదీ శుభ్రమైనదో ?తెలియడం లేదు. ప్రస్తుతం ఎక్కడ కూడా తినే ఫుడ్, అవి వండే వంటశాలలు శుభ్రంగా లేవని తెలుస్తుంది. ఎందుకంటే అహార భద్రతా అధికారులు తనిఖీల్లో ఈవిషయాలు భయటకు వస్తున్నాయి. ఎక్కడా పరిశుభ్రత లేని పాత్రలు, కల్తీ వంట సామాగ్రి, కుళ్ళిపోయిన కూరగాయలు, పాడైపోయిన పండ్లు, వాడేసిన వంటనూనెలు మళ్ళీ వండటం వంటివి కనిపిస్తున్నాయి. తాజాగా సికింద్రాబాద్‌లోని అల్వాల్, లోతుకుంట, జొన్నబండ, తుర్కపల్లి ప్రాంతాల్లో ఉన్న పండ్ల దుకాణాలు, అక్రమ ధనియాల పొడి తయారు చేస్తున్న కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. లోతకుకుంట పండ్ల దుకాణంలో పాడైపోయిన పండ్లనుంచి పండ్ల రసాన్ని తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. వెంటనే వాటిని ధ్వంసం చేసి దుకాణ యజమానిపై కేసు నమోదు చేశారు. అలాగే తుర్కపల్లిలో లేబులింగ్ లేకుండా తయారు చేస్తున్న ధనియాలపొడి స్వాధీనం చేసుకున్నారు. దుకాణాలను సీజ్ చేయడంతోపాటు వారిపై కేసులు నమోదు చేశారు.

**ప్రముఖ హోటళ్ల వంటగదుల్లోనూ దుర్వాసన ..**

రాజధాని హైదరాబాద్‌లోని ప్రముఖ హోటళ్లలో సైతం కల్తీ ఆహారం అడ్డూఅదుపు లేకుండా పోతుంది. ఆహార భద్రతా అధికారులు గతరెండు రోజులుగా నిర్వహించిన తనిఖీల్లో సోమాజీగూడలోని క్రుతుంగ రెస్టారెంట్, రెస్టోబార్ , కెఎఫ్‌సిలలో అనేక సమస్యలు బయటపడ్డాయి. వంటగదుల్లో దుర్గంధం వెలువడటం, కల్తీ ఆహార పధార్థాలు, వడ్డించే గిన్నెశుభ్రం చేయని హోటళ్లు ,రెస్టారెంట్లు గుర్తించామని అధికారులు పేర్కొన్నారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ లేని సంస్థల పేరుతో తయారై ఆహార పదార్థాలు వండుతున్నారని చెప్పారు. రిఫ్రిజిరేటర్లలో ప్యాకింగ్ లేకుండా మాంసాహారాన్ని నిల్వచేయడం, నాసిరకం మసాలాలు వాడుతున్నారని వాటన్నింటిని ధ్వంసం చేసి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

## జూన్ 7లోగా విద్యార్థులకు యూనిఫాంలు సిద్ధం చేయాలి

**-దుస్తుల తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలి**

**-అధికారులకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశం**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, డిఈవో రోహిణి తదితరులు

**హైదరాబాద్,మే 23,ప్రభాతవార్త:**

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థినీ ,విద్యార్థులకు సంబంధిత పాఠశాలలో తీసుకున్న కొలతల ఆధారంగా యూనిఫాంల స్టిచ్చింగ్ జూన్ 7లోగా పూర్తి చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్లు, డిప్యూటీ ఐఓఎస్‌లు, ఎస్సీ,ఎస్టీ బిసి మైనార్టీ సంక్షేమ అధికారులతో వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఏకరూప దుస్తుల స్టిచ్చింగ్‌పై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని అధికారులకు తగు ఆదేశాలు ఇచ్చారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పాఠశాల విద్యార్థుల ఏకరూప దుస్తులను కట్టుటకు స్వయం సహాయక బృందాలకు పని అప్పగించడం జరిగిందన్నారు. హైదరాబాద్ జిల్లాలోని 768 పాఠశాలల్లో 1,34,476 (63153 బాలురు, 71323 బాలికలు) విద్యార్థినీ విద్యార్థులకు సంబంధించిన యూనిఫాంల కుట్టుపని మే 25న మొదలుపెట్టి జూన్7లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతిరోజు టార్గెట్ పెట్టుకుని కుట్టుపనులను పర్యవేక్షించాలన్నారు. దుస్తుల తయారీ నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలన్నారు. డిప్యూటీ ప్రాజెక్ట్ అధికారులు, డిప్యూటీ ఐవోఎస్‌లు సమన్వయంతో పనిచేసి సకాలంలో దుస్తులు అందేలా చూడాలన్నారు. విద్యాసంవత్సరం రోజే విద్యార్థులకు దుస్తులు, టెక్స్ట్ బుక్కులు అందించాలని సూచించారు. ఈసమావేశంలో జిల్లా విద్యాధికారి కె.రోహిణీ, జిహెచ్ఎంసి యుసిడి అడిషనల్ కమిషనర్ సి.చంద్రకాంత్‌రెడ్డి, జాయింట్ కమిషనర్ ఎస్ వెంకట్‌రెడ్డి, డిప్యూటీ డీఈవోలు తదితరులు పాల్గొన్నారు.

# తాళం వేసిన ఇళ్ళపై దొంగల గురి

**-నగరంలో వరుస దొంగతనాలు -ముందు జాగ్రత్త చర్యలు సూచించిన పోలీసులు**



**హైదరాబాద్, మే23, ప్రభాతవార్త:** తాళం వేసిన ఇళ్ళని లక్ష్యంగా చేసుకున్న దొంగలు వరుస చోరీలతో నగరంలోని కలకలం సృష్టిస్తున్న నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు నగర వాసులకు ముందు జాగ్రత్త చర్యలు సూచించారు. పని మీద ఊరు వెళ్ళినప్పుడు తాళం వేసిన ఇంటిని పూర్తి చీకటిగా ఉంచకుండా ముందు గదిలో లైటు వేసి ఉంచాలని, ఇంటికి వాచ్‌మేన్ లేని పక్షంలో తెలిసిన ఇరుగు పొరుగు వారికి సమాచారం అందివ్వాలని, అవసరమైతే తమ కాలనీలో ఉన్న ఇతర వాచ్‌మేన్‌ల సహాయం తీసుకుని, తాము ఊరి నుంచి తిరిగి వచ్చే వరకూ తమ ఇంటిపై నిఘా వేసి ఉంచమని సూచించాలని తెలిపారు. ముఖ్యంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందిస్తే రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ పోలీసులు ఆయా ప్రాంతాల వీధుల్లో నిఘా పటిష్టం చేస్తారని పేర్కొన్నారు. ఇటీవలె జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఒక వైద్యుడి ఇంట్లో రూ.20 లక్షల నగదు చోరీ చేసిన దొంగని తాజాగా అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. గత వారం హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దోపిడీ దొంగలు వేరు వేరు ఇళ్ళలో చొరబడి తాళాలు పగలగొట్టి 15 తులాల బంగారం, రూ.5 లక్షల నగదు చోరీ చేశారు. ఈ ఘటనలో తగిన ఆధారాలు సేఖరించిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మరోపక్క ఎస్ఆర్ నగర్ ప్రాంతంలోని జెక్ కాలనీ ఆకృతి అపార్ట్‌మెంట్‌లో తాళం వేసిన ఒక ఫ్లాట్‌లో పధకం ప్రకారం తమను గుర్తు పట్టకుండా చూడీదర్‌లు వేసుకున్న దుండుగలు భారీ చోరీ చేసిన నేపధ్యంలో వారు ముందుగానే రెక్కీ వేసి ఫ్లాట్ యజమానులు ఊరు వెళ్ళే విషయం తెలుసుకున్నారని పోలీసులు తెలిపారు. ఈ మేరకు పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టిన స్థానిక పోలీసులు ప్రజలను నిరంతరం అప్రమత్తంగా ఉండాలంటూ సూచించారు.

**అదును చూసి చోరీలు :**

రాచకొండ కమీషనరేట్ ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస దొంగతనాలు చేసిన వెంకట రమణ అనే వ్యక్తిని ఇటీవలె ప్రత్యేక బృందాలుగా ఏర్పడిన పోలీసులు అరెస్ట్ చేశారు. ఐతే గతంలో ఇతడు రెండు వందలకు పైగా చోరీ కేసుల్లో ప్రధాన నిందితుడుగా ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే, వెంకట రమణ(50) అనే వ్యక్తి ఘట్ కేసర్, పోచారం ఐటీ కారిడార్, సిద్ధిపేట, కోదాడ, మిర్యాలగుడా తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో వరుస దొంగతనాలు చేస్తుండేవాడు. నిందితుడికి కౌన్సిలింగ్ ఇచ్చి ఉపాధి కల్పిస్తే దొంగతనాలు మానేస్తాడనుకున్న పోలీసుల నమ్మకాన్ని వమ్ము చేస్తూ, తొలుత రెండేళ్ళ విరామం తీసుకున్నాడు. అనంతరం అదును చూసి మరోసారి వరుస దొంగతనాలు చేసే క్రమంలో పట్టుబడ్డాడు. తాళం వేసి ఉన్న ఇళ్ళనే టార్గెట్ చేస్తూ దొంగతనాలు చేసే వెంకటరమణ, చోరీ చేసే క్రమంలో టోపీ, ముఖం కనిపించకుండా మాస్క్, చేతులకు గ్లౌజులు ధరించి సీసీ కెమేరాలు ఉంటే తననెవరూ గుర్తుపట్టకుండా దివ్యాంగుడిగా నటిస్తూ కుంటుకుంటూ నడుస్తాడు. అనంతరం తాళం వేసిన ఇళ్ళలో చోరీ చేసి పరారవుతాడు. ఈ క్రమంలో వివిధ పాంతాల్లో సీసీ టీవీ ఫుటేజ్ గమనించిన పోలీసులు, సిసి కెమేరాలు ఉంటే ఒకలా, అవి లేకపోతే మరోలా నడుస్తున్న వ్యక్తిని దొంగగా అనుమానించారు. దాంతో అతడిని పట్టుకుని ఎంక్వైరీ చేయగా పాత నేరస్థుడు వెంకట రమణగా గుర్తించారు. అతడి నుంచి 21 తులాల బంగారం, కిలో వెండి, రూ.1,50,000 నగదు స్వాధీనం చేసుకున్నారు.

# 60 శాతం సబ్సిడీపై జీలుగు విత్తనాలు

## -మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రావు

**గుమ్మడిదల, మే23 ప్రభాతవార్త:**
గుమ్మడిదల మండల రైతన్నలకు 60 శాతం సబ్సిడీపై జీలుగు విత్తనాలు మండల సహకార సంఘం కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి డి. శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ వానాకాలం 2024కు గాను క్వింటాల్ పూర్తి ధర రూ.9,300 అని, అందులో సబ్సిడీ (60%) రూ,5,800 పోను, రైతు చెల్లించాల్సింది రూ.3720 అని, 30 కేజీల బస్తాకు రూ.1116 చెల్లించాలని వివరించారు. కావలసిన రైతులు పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌లు తీసుకొని గుమ్మడిదల వ్యవసాయ సహకార సంఘం వద్దకు రావాలని సూచించారు. ఒక బస్తా 2 ఎకరాలకు సరిపోతుందన్నారు. ప్రస్తుతం 116 బ్యాగులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.


లుంబిని పార్క్‌లోని బుద్ధ విగ్రహం వద్ద బౌద్ధ భిక్షువుల ప్రార్థన కార్యక్రమంలో పాల్గొన్న ఎపిఎస్ శైలజ రామయ్యర్, ప్రిన్సిపల్ సెక్రటరీ నిఖిల

# నెలాఖరుకు ధాన్యం కొనుగోలు పూర్తి

## -అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు


కొడుపాకలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

**పాపన్నపేట, మే 23, ప్రభాతవార్త:** ఈ నెలాఖరు వరకు ధాన్యం కొనుగోళున పూర్తి చేస్తామని మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల పరిధిలోని కొడుపాక గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వ కొంటుందో లేదో అని రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్నారు. జిల్లాలో ఈ మే నెలాఖరు వరకు రైతుల పండించిన వరి ధాన్యంను పూర్తిగా కొనుగోలు చేసేలా తగు ప్రణాళిక రూపొందించామన్నారు. ధాన్యం కొనుగోలులో రవాణా కోసం ఇతర జిల్లాల నుంచి అదనపు వాహనాలను తెప్పించామన్నారు. దళారులను రైతులు నమ్మొద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యంను విక్రయించుకుని ఆర్థికంగా లబ్దిపొందాలని జిల్లా రైతులకు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు.

# అమీన్‌పూర్ పెద్ద చెరువును పరిశీలించిన కలెక్టర్ క్రాంతి వల్లూరు


అమీన్‌పూర్ పెద్ద చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి వల్లూరు

**అమీన్‌పూర్, మే23 ప్రభాతవార్త:**
అమీన్‌పూర్ పెద్ద చెరువు శిఖం భూముల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లకు సంబంధించిన రిపోర్టులను వెంటనే సమర్పించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం అమీన్‌పూర్ పెద్ద చెరువును స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మున్సిపల్ అధికారులు, నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తూముల నుండి నీరు కిందికి వెళ్లే కాలువలను కలెక్టర్ పరిశీలించారు. చెరువు తూములకు సంబంధించి మ్యాపులను, నీరు కిందికి వెళ్లే మార్గాలను, తూముల వివరాలను అధికారులకు కలెక్టర్‌కు మ్యాప్ ద్వారా వివరించారు. వెంటనే చెరవుకు సంబంధించిన ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లకు సంబంధించిన రిపోర్టులను అందజేయాలని ఈ సందర్భంగా నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాడు వెల వెల...నేడు కళ కళ

## - కోరిన వారింట బంగారమౌతున్న బొడ్మట్‌పల్లి వీరభద్రుడు

## - నేటి నుంచి శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు

**టేక్మాల్,మే 23 ప్రభాతవార్త :**
గత కొనేళ్లుగా పురాతన ఆలయం అభివృద్ధికి నోచుకొక వెల వెల బోయింది. ఈ ఆలయం మారు మూల ప్రాంతంలో కాదు.. జాతీయ రహదారిని అనుకోని ఓ గుట్ట.. ఆగుట్టపై పక్షుల కిల కిల రావాలతో కూసే అహ్లాద వాతవారణంలో శ్రీ వీరభద్రుని దేవాలయం ఉంది. అందులో శ్రీ వీరభద్రుడు భద్రకాళీ అమ్మవారితో కొలువు దీరారు. ఈ ఆలయం నేడు నిత్య పూజ కార్యక్రమాలతో కళ కళలాడుతొంది. కొరిన వారి ఇంట బంగారమౌతున్న బొడ్మట్‌పల్లి శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రాలయం 161వ జాతీయ రహదారిని అనుకొని ఉన్న మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని బొడ్మట్‌పల్లి శ్రీభద్రకాళీ సమేత వీరభద్రల దేవాలయం గుట్టపై కొలువుదీరారు. గత 15సంవత్సరాల నుండి భక్తుల సహకారంతో నిత్యాభివృద్ధి జరుగుతొంది. అప్పట్లోన గ్రామ యువజన సంఘాల ఆధ్వర్యంలో వెనక భాగం నుంచి మట్టీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. వీరశైవలింగాయత్ సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తుల, దాతల సహయ సహాకరాలతో ఆలయ ఆభివృద్ధికి శ్రీకారం చూట్టారు.


నాడు వెలవెల ..నేడు కళ కళలాడుతున్న బొడ్మట్‌పల్లి వీరభద్రాలయం

2012లో ఆలయాన్ని సందర్శించి భక్తుల సౌకర్యర్థం కోసం అప్పటి ఉమ్మడి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ 12. లక్షల రూపాయల నిధులు మంజూరు చేసి ఆలయానికి సీసీ రోడ్డు నిర్మింపజేశారు. పదేళ్లు గడిచిన పాలకులు మారారు కాని దేవాలయ అభివృద్ధికి కృషి చేయలేదు. ఇటీవల జరిగిన ఎన్నికల్లోనభారీ మేజార్టీతో గెలుపొందిన తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య, అండ్‌సైన్స్ టెక్నాలజి శాఖ మత్యులుగా పదవీ భాద్యతలు చేపట్టిన దామోదర్ రాజనర్సింహ ఆలయానికి వెళ్లే సీసీ రోడ్డు వెడల్పుకు 5 లక్షల రూపాలయను మంజురు చేసి నిర్మాణం పూర్తి చేయించారు. దీంతో కొరిన కొర్కెలు తీర్చే వీరభద్రాలయ అభివృద్ధికి మంత్రి దామోదర్ నిధుల మంజూరి చేసి ఆ పనులు పూర్తి చేయించడం పట్ల భక్తులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భక్తుల, దాతల వివరాలతో ఆలయ అవరణంలో ప్రహరి గొడ నిర్మాణం, షేడ్ల నిర్మాణం, సత్రాల నిర్మాణం, 12 లక్షల రూపాయలతో రథం లాంటి కార్యక్రమాలతో ప్రతి ఏటా దాతల సహయ సహకారాలతో ఆలయం ప్రగతి పథంలో ముందుకు సాగుతొంది. దీంతో ఆలయ ప్రాంగణంలో పెళ్లిళ్లు, పెరంటాలలతో ప్రతి నిత్యం దూప దీపనైవేద్యాతలో పూజ కార్యక్రమాలతో దేవాలయం ఓం నమోశివాయ అంటూ శివనామ స్మరణతో మారుమ్రోగుతుంది. కొరిన వారింట కొంగు బంగరమౌతున్న శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రులను భక్తులు దర్శించుకొని వారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ కమిటి కొరుతొంది.

### నేటి నుంచి బొడ్మట్‌పల్లి శ్రీ భద్రకాళీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు

ఈనెల 23వ తేది నుండి మే 31వ తేది వరకు టేక్మాల్ మండల పరిధిలోని బొడ్మట్‌పల్లి గ్రామ శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు జరుపనున్నట్లు ఆయల కమిటీ చైర్మెన్ ఉప్పు బస్వరాజ్ పాటిల్ తెలిపారు. 24 తేది శుక్రవారం అగ్నిగుండాలు, 25వ తేది శనివారం శ్రీభద్రకాళీ సమేత వీరభద్ర స్వాముల కళ్యాణోత్సవం, 26వ తేదిన గ్రామ దేవతలకు బోనాలు,27 వతేదిన బండ్లు, 28 తేదిన కుస్తీలు, 29 తేదిన రథోత్సవం, 30వ తేదిన లంకదహనం, 31వ తేదిన పాచిబండ్లు తిరుగుట కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో హజరై జాతర మహోత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు. బ్రహ్మోత్సవాలకు వచ్చిపోయె భక్తులు అన్ని సౌకర్యాలను సమకుర్చినట్లు వారు చెప్పారు. భక్తులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. జాతర మహోత్సవాలల్లోన ఎలాంటి ఆవంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసుల బందోబస్తు ఉంటుందన్నారు.

# విద్యార్థులు పదవ తరగతిలో ప్రతిభ చాటడం జిల్లాకే గర్వకారణం

## -జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్


హాజరైన విద్యార్థిని విద్యార్థులు

**సంగారెడ్డి బ్యూరో, మే23 ప్రభాతవార్త:**
జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో తమ ప్రతిభ చాటి ఉత్తమ ర్యాంకులు సాధించడం జిల్లాకే గర్వకారణం అని, బాల బాలికల ప్రగతికి కృషి చేసిన తల్లితండ్రులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల కృషి హర్షించదగ్గ విషయమని, ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన గుణాత్మక విద్య అందుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం మెదక్ పట్టణంలోని హెచ్ కన్వెన్షన్ హాల్‌లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తూ పదవ తరగతిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు కేరీర్ గైడెన్స్‌పై అవగాహన, విద్యార్థినీ విద్యార్థులకు అభినందన సన్మాన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో విద్యార్థిని విద్యార్థులు సుమారు 400 మంది ఉత్తమ ఫలితాలు సాధించి మెదక్ జిల్లా రాష్ట్ర వ్యాప్తంగా మంచి స్థానంలో నిలబడటం గర్వకారణమని వివరించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల గుణాత్మక విద్య వల్లే ఇది సాధ్యపడిందని చెప్పారు. విద్యార్థులకు పదవ తరగతి ఒక తొలిమెట్టు లాంటిదని, పదవ తరగతిలో మంచి ప్రతిభ కనబర్చితే విద్యార్థుల భవిష్యత్ బంగారు బాట పడుతుందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఉన్నత స్థాయి ఫలితాలు సాధించేలా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కృషి చేశారని వివరించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఒక ప్రణాళికలను సిద్ధం చేసుకొని ముందుకు సాగుతూ చదివించారన్నారు. ఉన్నత విద్యలోకి ప్రవేశించేందుకు ఇంటర్మీడియట్ వైపు మొగ్గ చూపుతారని, ఎందుకంటే ఉన్నత విద్యారంగానికి ఇది గెట్ వే లాంటిందని అన్నారు. విద్యార్థి అభిరుచి, సామర్థ్యం రెండింటినీ దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు కూడా ఏ గ్రూపులో చేరాలనే విషయమై సలహాలు ఇవ్వాలన్నారు. ఇంటర్మీడియట్‌లో గ్రూప్‌ను ఎంచుకోవడమే అత్యంత కీలకమైన అంశమని, ఈ గ్రూపు మీదే మిగిలిన ఉన్నత విద్య అంతా ఆధారపడి ఉంటుందన్నారు. ఇంటర్మీడియట్ తరువాత ఎవరెవరు ఏ సబ్జెక్టు తీసుకొని ఏ రంగంలో రాణించగలుగుతారని విద్యార్థి విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఇదే ఒరవడి కొనసాగిస్తూ ప్రణాళిక ప్రకారం విద్యను అభ్యసించాలని అన్నారు. అనంతరం 10/10, 9.8, 9.5 జీపీఏ సాధించిన విద్యార్థులను మెమొంటోలు, సర్టిఫికెట్లతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణలో సూపర్‌వైజర్ల పాత్ర కీలకం

## -జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
జిల్లాలో పార్లమెంటు ఎన్నికల కౌంటింగ్ కోసం 79 మంది సూపర్‌వైజర్లు, 80 మంది కౌంటింగ్ అసిస్టెంట్లును నియమించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు మొదటి విడత శిక్షణ తరగతులను నిర్వఇంచారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాలు మెదక్ పార్లమెంటు పరిధిలోకి వస్తాయని కౌంటింగ్ కేంద్రం నర్సాపూర్ బివిఆర్ ఐటి కళాశాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం కరీంనగర్ పార్లమెంటు పరిధిలోకి వస్తుందని కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణలో సూపర్‌వైజర్ల పాత్ర కీలకమని కౌంటి ంగ్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా సమర్ధవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎలక్షన్ కమిషన్ అఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం కౌంటింగ్ సెంటర్లలో కౌంటర్ల వారీగా ప్రతి సూపర్‌వైజర్ మిషన్లలో ఎలాంటి సాంకేతిక సమస్యలు ఎదురైనా నియోజకవర్గ ఎఆర్ఓను సంప్రదించాలన్నారు. శిక్షణ తరగతులలో జిల్లా మాస్టర్ ట్రైనర్ అధికారి అయోధ్యరెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కౌంటింగ్ ప్రక్రియపై వివరించారు. కార్యక్రమంలో అర్డీఓలు సదానందం, బన్సీలాల్, జిల్లా ట్రైనింగ్ నోడల్ అఫీసర్(డిపిఒ) దేవకీదేవి, జిల్లా మాస్టర్ ట్రైనర్స్ పాల్గొన్నారు.

# త్వరగా ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలి

## -జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్


కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

**కొల్చారం, మే23 ప్రభాతవార్త:**
కొల్చారం మండలంలోని వరిగుంతం గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సందర్శించి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ వరిగుంతం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ తుది దశలో ఉన్నందున త్వరితగతిన కేంద్రంలో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు పూర్తి చేసి మిల్లులకు ధాన్యం తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. గత ఖరీఫ్‌లో 2023-24 సీజన్‌లో 16,994.80 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి 389 రైతులకు 33.74 కోట్లు చెల్లించడం జరిగిందని, ఈ యాసంగి 2023-24లో ఇప్పటి వరకు 380 మంది రైతుల నుండి 17,158 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారని, ఇంకా సుమాఉగా 4 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి ఒక వారంలో ట్యాబ్ ఎంట్రీ కూడా పూర్తి చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ప్రస్తుతం వరి ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయని, గత యాసంగి సీజన్‌లో జిల్లాలో ఈ రోజు నాటికి 1,34,566 టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం కొనుగోలు కేంద్రాల్లో సుమారు ధాన్యం కొనుగోళ్లు పూర్తి కాలేదు కానీ ప్రస్తుతం జిల్లాలో మొత్తం 410 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 2,27,707.800 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం 52,575 మంది రైతుల వద్ద నుండి కొనుగోలు చేసి రూ.367.23 కోట్లు చెల్లించడం జరిగిందన్నారు. 123 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తయిందన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగుతుందని జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగుతుందన్నారు. జిల్లాలో మిగిలి ఉన్న ధాన్యాన్ని కూడా కొనుగోలు పూర్తి చేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 34 బాయిల్డ్ మిల్లులు, 31 రా మిల్లులకు ధాన్యం కుటాయించడం జరిగిందన్నారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసేందుకు మన జ ఇల్లా నుండి సిద్ధిపేట జిల్లాకు 10,000 మెట్రిక్ టన్నులు, మహబూబ్‌నగర్ జిల్లాకు 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పంపించడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో సుమారుగా 600 పైగా లారీలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇవి కాకుండా ఇంకా 150 లారీల వరకు తెప్పించడం జరుగుతుందన్నారు. తద్వారా ధాన్యం సేకరణ ప్రక్రియ వేగవంతం అవుతుందన్నారు. పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, అకాల వర్షాలకు రైతులు కంగారు పడొద్దన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రం చివరి గింజ కొనేవరకు పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు, తహశీల్దార్ గఫార్ మియా, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ప్రభాకర్, సొసైటీ చైర్మన్ చిన్నారం ప్రభాకర్, సీఈవో రాములు, ముత్యంగారి సంతోష్‌కుమార్, రైతులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# 65 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం


రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్న దృశ్యం

**కోహేడ, మే 23, ప్రభాతవార్త :**
కోహేడ మండల కేంద్రంలోని ఎన్టీఆర్ నగర్ కాలనీలో గంట ఎల్లవ్వ, గంట ఎల్లమ్మ, గంట బుచ్చమ్మ ముగ్గురు కలిసి రేషన్ బియ్యం డంప్ చేసినట్లు వచ్చిన నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్సు పోలీసులు, కోహేడ ఎస్ఐ తిరుపతితో కలిసి దాడి చేశారు. డంపులో 65 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. కోహేడ పోలీసులు కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నారు. గంట ఎల్లవ్వ, గంట ఎల్లమ్మ, గంట బుచ్చమ్మలు గ్రామాలలో తక్కువ రేటుకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఎక్కువ రేటుకు అమ్ముదామని అక్రమంగా ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా డంప్ చేశారని తెలిపారు. గ్రామాల్లో, పట్టణాల్లో ఇసుక, రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేసిన నిల్వ చేసిన చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని టాస్క్‌ఫోర్సు పోలీసు అధికారులు తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు 87112667445, 87112667446, 87112667447 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

# టేక్మాల్‌లో విద్యుత్ షాక్‌తో మూడు బర్రెలు మృతి

## -రూ, 2లక్షల 50 వేల నష్టం


విద్యుత్ షాక్ తగిలి మృతి చెందిన బర్రెలు, రోదిస్తున్న బాధితులు

**టేక్మాల్,మే 23 ప్రభాతవార్త :** విద్యుత్ షాక్‌తో మూడు బర్రెలు మృతి చెంది సుమారు రూ, 2లక్షల 50 వేల నష్టం వాటిల్లిన సంఘటనమండల కేంద్రమైన టేక్మాల్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే ఈ విధంగా ఉన్నాయి. బుధవారం రాత్రి ఇదురు గాలులు వీచి గ్రామ శివారులో వ్యవసాయ క్షేత్రాల వద్ద విద్యుత్ తీగలు తెగి పడి పోయాయి. టేక్మాల్ గ్రామానికి చెందిన శంకరయ్య మూడు బర్రెలు మేతకోసం వెళ్లి విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాయి . దీంతో 2.5 లక్షల నష్టం వాటిల్లినట్లు భాదితులు తెలిపారు. ప్రభుత్వం వెంటనే నష్టం పరిహారం అందించాలని కొరుతున్నారు.

# స్థానికసంస్థలకు ముహుర్తమెన్నడో ..?

## -పల్లెల్లో స్పెషల్ అధికారుల పాలనలో పంచాయితీలు

## -అభివృద్ధికి దూరమవుతున్న పల్లెలు



గ్రామ పంచాయతీ (ఫైల్‌ఫోటో)

**హుస్నాబాద్,మే 23,ప్రభాతవార్త**
పల్లెలు ప్రగతి సాధించాలంటే గ్రామస్వరాజ్యం సాధించాలని బాపూజీ కలలు కన్నట్లుగా ముందుకు సాగడంలేదు.ఆయా రాజకీయపార్టీలు తమకు అనుకూలంగా మలుచుకుంటూ తమకు నచ్చిన పద్దతిలోనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు యోచిస్తున్నారు,వాస్తవానికి తెలంగాణ రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు ముగిసిన అనంతరం స్థానిక సంస్థలకు ఎన్నికలను నిర్వహించాల్సి ఉంది.ఈ నేపధ్యంలో పార్లమెంట్ ఎన్నికలు రావడంతో స్థానికసంస్థల ఎన్నికల వాయిదా పడ్డాయి.పల్లెల్లో ప్రభువుల పాలన ముగియగానే స్పెషల్ అధికారులతోనే ప్రభుత్వం పాలన సాగిస్తుంది.దీంతో పల్లె ప్రజానీకం అభివృద్ధికి నోచుకోక అష్టకష్టాలు పడాల్సిన దౌర్భాగ్య పరిస్థితులు నెలకొంటున్నాయి.ఈ దశలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఎన్నికలను తెలంగాణ ప్రభుత్వం తామిచ్చిన హామీలను అమలు చేశాకే నిర్వహిస్తే ప్రజల ఓట్లను దండుకోవచ్చని భావిస్తున్నట్లు ఆయా రాజకీయపార్టీల నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు.ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజలకు హామీ ఇచ్చినట్లుగా ప్రధానంగా వ్యవసాదారుల పంట రుణాలకు సంబందించి రుణమాఫీతో పాటు రిజర్వేషన్ల అమలు ప్రభుత్వం చేపట్టాల్సి ఉంది. ఇందుకు ప్రభుత్వం ముందుగా ఇవి అమలు చేసి స్థానిక సంస్థల ఎన్నికల బరిలోకి దిగవచ్చని భావిస్తున్నట్లు వినికిడి.ఈ తరుణంలో ముందుగా కులగణన చేపట్టి అనంతరం రిజర్వేషన్లు ప్రక్రియను ముగించి స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలు స్తోంది.ఈ తరుణంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ళు,గృహలక్ష్మి పథకాలను రాష్ట్రంలో అమలు చేసి ఎన్నికల బరిలో దిగితే కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఓట్లు పడతాయని పార్టీ భావిసుస్తున్నట్లు సమాచారం.

# టోకెన్ల కోసం ఎగబడ్డ రైతులు

## -నర్సాపూర్‌లో జీలుగ విత్తనాల కోసం రైతుల పడిగాపులు


నర్సాపూర్ లోని రైతు వేదిక కేంద్రంలో జీలుగ విత్తనాల

**నర్సాపూర్ మే, 23. ప్రభాతవార్త :** ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో పంటల భూములను సారవంతం చేయడానికి గాను రైతులు జీలుగ విత్తనాల కోసం పడరాని పాట్లు పడుతున్నారు.గత నాలుగైదు రోజుల నుండి నర్సాపూర్‌లో రైతులు జీలుగ విత్తనాల కోసం పడిగాపుల కాస్తున్నారు. ఈ మేరకు నర్సాపూర్‌లోని వ్యవసాయాధికారులు జీలుగ విత్తనాలు వచ్చిన వెంటనే ఒకసారి పంపిణీ చేశామని చెబుతున్నారు.మళ్లీ లోడ్ వస్తే ఈ విత్తనాలను పంపిణీ చేస్తామనిని చెప్పగా రైతులు వెళ్ళిపోయారు. కాగా గురువారం నర్సాపూర్ వ్యవసాయ కేర్యాలయానికి జీలుగ విత్తనాలు వచ్చాయన్న విషయం తెలియగానే మండల పరిధిలోపి రైతులు జీలుగ విత్తనాలకోసం ఎగబడ్డారు. నర్సాపూర్‌లోని రైతేవేదిక కేంద్రంలో వ్యవసాయాధికారులు ఒక రైతుకు ఒక పట్టా పాస్‌బుక్ పైన ఒక సంచి జీలుగ విత్తనాలు ఇస్తామని తెలిపగా రైతులు తమ పట్టాపాస్‌బుక్‌లు, ఆధార్‌కార్డు తీసుకొని రైతువేదిక వద్దకు వచ్చి బారులు తీరారు. ఈమేరకు వ్యవసాయాధికారులు వరుసలో ఉండి జీలుగ విత్తనాల టోకెన్లు తీసుకోవాలని తెలిపారు. దీంతో రైతులు రైతువేదిక వద్ద గుమిగూడారు. క్యూలో నిల్చోని టోకెన్లు తీసుకుంటున్నారు. ఈ మేరకు నర్సాపూర్ నకు ఒక లోడ్ జీలుగ విత్తనాలు రాగా ఆ లోడ్‌కు సరిపోయే టోకెన్లు ఇస్తామని అధికారులు తెలుపడంతో రైతులు ఈ జీలుగ విత్తనాల టోకెన్ల కోసం రైతువేదిక కేంద్రంలో కిక్కిరిసిపోయారు.జీలుగ వితనాల సరఫరాలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తు సక్రమంగా సరఫరా చేయడం లేదని కొందరు రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు సరిపడా జీలుగ విత్తనాలు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ సమయంలో నర్సాపూర్‌నకు చెందిన రైతులు దాచారం ప్రకాష్, అశోక్‌యాదవ్, బబ్బూరి కృష్ణ, జలెందర్, పంబళ్ల నరేవ్‌లతో పాటు మండల పరిధిలోని రైతులు తదితరులు ఉన్నారు.

# ప్రాణాలు పోతున్నా మీకు పట్టదా

-మేయర్ ఎందుకు ఇంత నిర్లక్ష్యం
-వెంటనే రోడ్డు నిర్మించాలి
-బురద నీటిలో కూర్చొని మహిళ నిరసన


రోడ్డుపై వరద నీటిలో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళ

**ఎల్.బి.నగర్, మే 23 ప్రభాతవార్త:** గుంతల మయంగా మారిన రోడ్లు మరోపక్క వరద నీటితో ప్రాణాలు పోతున్న ప్రజాప్రతినిధులు అధికారులకు కళ్ళు కనపడడం లేదని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. గుంతల మయంగా మారిన రోడ్డులో వరదనీరు చేరి ప్రజలు ప్రమాదాలకు గురవుతున్న పట్టించుకోకపోవడంతో మహిళ నిరసనకు దిగింది. ఈ సంఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బండ్లగూడ చౌరస్తాలో గురువారం చోటుచేసుకుంది. కుంట్లూరు గ్రామానికి చెందిన నిహారిక అనే మహిళ గురువారం బండ్లగూడ చౌరస్తా రోడ్డులో ఉన్న బురద నీటిలో కూర్చుని నిరసన వ్యక్తం చేసింది. రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారిందని వర్షాకాలంలో గుంతల్లో నీరు నిండి అనేకసార్లు ప్రమాదాలు జరిగాయని ఈ విషయమై నగర మేయర్ విజయలక్ష్మికి ట్విట్టర్ ద్వారా సమాచారం ఇచ్చినప్పటికీ స్పందించ లేదన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు కూడా ఎవరు జరుగుతున్న ప్రమాదాలపై స్పందించి రోడ్డు నిర్మించాలని ఆలోచన ఎందుకు చేయడం లేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగోల్‌లో చదివించేందుకు తన పిల్లలను తీసుకొని వస్తున్న క్రమంలో అనేకసార్లు గుంతల రోడ్డులో పడి తాము గాయాలపాయ లయ్యామని ఈ విషయమై నగర మేయర్, ప్రజాప్రతినిధులు, అధికారులకు ఫిర్యాదు చేసిన ఎవరూ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బండ్లగూడ చౌరస్తాలోని బురదమైన రోడ్డుపై మహిళ బైఠాయించడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. సమాచారం తెలియడంతో ట్రాఫిక్ పోలీసులు ఆమెను అక్కడి నుంచి పంపించే ప్రయత్నం చేసిన వినకపోవడంతో నాగోల్ పోలీసులు వచ్చి ఆమెను సమాధానపరిచి పంపించారు. అయితే రోడ్డు నిర్మాణానికి సంబంధించి నిధులు మంజూరు అయ్యాయని ఎన్నికల కోడ్ కారణంగా రోడ్డు నిర్మాణం పనులు చేపట్టలేదని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ తెలిపారు. ఎన్నికల అనంతరం రోడ్డు నిర్మాణం పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.

**రూ. 4కోట్లు మంజూరు:చింతల**

రోడ్డు నిర్మాణానికి సంబంధించి రూ.4 కోట్లు మంజూరు అయ్యాయని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్‌యాదవ్ తెలిపారు. ఎన్నికల కోడ్ వర్షాల కారణంగా రోడ్డు నిర్మాణం పనులు చేపట్టలేకపోయామని అన్నారు. నాగోలు నుంచి హిందూ అరణ్య వరకు త్వరలో రోడ్డు నిర్మాణం పనులు జరుగుతాయని తెలిపారు.

**పట్టించుకోని ఆర్ అండ్ బి అధికారులు...**

ఆర్అండ్‌బి పరిధిలోకి వచ్చే ఈ రోడ్డును చాలాకాలంగా ఆ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గౌరెల్లి అవుటర్ రింగ్ రోడ్డు వెళ్లేందుకు నాగోల్ నుంచి పెద్దఎత్తున ప్రతి రోజు వాహనాలు ప్రయాణం కొనసాగిస్తుంటాయి. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే నాగోలు బండ్లగూడ రోడ్డు పరిస్థితి చాలాకాలంగా దయనీయంగా మారింది. ఇప్పటికైనా ఆర్అండ్‌బి అధికారులు స్పందించి త్వరగా పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

# కోకాపేట్‌లో అక్రమ నిర్మాణాల శ్లాబులు కూల్చివేత

- టౌన్‌ప్లానింగ్ అధికారుల అండతోనే వెలిసిన అక్రమ నిర్మాణాలు
- అనుమతి మేరకే నిర్మాణాలు చేపట్టాలి : కమిషనర్

**నార్సింగి, మే 23 ప్రభాతవార్త :** చాలా రోజుల తరువాత హెచ్ఎండిఏ అధికారులు తామున్నామంటూ ప్రజలకు తెలిపేందుకు గురువారం నార్సింగి మున్సిపాలిటీ కోకాపేట గ్రామంలో కొన్ని అక్రమ నిర్మాణాల శ్లాబులు తొలగించారు. జి+2 అనుమతిని పొంది ఏకంగా జి+6,7 వరకు నిర్మాణాలు ఏడాది పొడవునా జరుగుతున్నా ఇటు స్థానిక నార్సింగి మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులుగాని, అటు హెచ్ఎండిఏ అధికారులుగాని పట్టించుకోకపోవడం గమనార్హం. కేవలం నిర్మాణాల కోసమే మున్సిపాలిటీలో టౌన్‌ప్లానింగ్ విభాగం కింద అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నా వారంతా అక్రమ నిర్మాణందారులిచ్చే ముడుపులకు ఆశపడి అసలు విధులకు ఎగనామం పెడుతూ వచ్చారు. అందు వల్లనే నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట్, గౌలిదొడ్డి, గండిపేట్, ఖానాపూర్, నార్సింగి, మంచిరేవుల, వట్టినాగులపల్లి గ్రామాలలో విచ్చల విడిగా అక్రమ నిర్మాణాలు వెలిశాయి. వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు వెలిసినా ఇక్కడి టౌన్‌ప్లానింగ్ అధికారులు కిమ్మనకపోవడం వెనుకాల ఆంతర్యమేమిటో బహిరంగ రహస్యమే. గౌలిదొడ్డిలో 111.జీవోను తుంగలో తొక్కి, మున్సిపల్ నుంచి గాని, హెచ్ఎండిఏ నుంచి గాని ఎలాంటి అనుమతి పొందకుండానే ఏకంగా జి+7వరకు భారీ బహుళ అంతస్థులు వెలుస్తున్నాయి. వందల సంఖ్యలో ఈ అక్రమ నిర్మాణాలున్నాయి. ఇప్పటి వరకు ఒక్కరంటే ఒక్క అధికారి కూడా అటు వైపు కన్నెత్తి చూడడం లేదెందుకో అర్థం చేసుకోవచ్చు. అప్పుడప్పుడు పత్రికలలో అక్రమ నిర్మాణాల గురించి వార్తలు వస్తే... మళ్లీ సదరు నిర్మాణందారుల వద్దకు కొందరు మున్సిపల్ అధికారుల ఏజెంట్లు వెళ్లి ప్రెస్‌ను మేనేజ్ చేసుకోవాలంటూ ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారన్న వార్తలు గుప్పుమంటున్నాయి. ఈ కోకాపేట్‌లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని గత పది నెలలుగా అనేక పత్రికలలో వార్తలు వచ్చాయి. కానీ ఏ ఒక్క అధికారి కూడా స్పందించలేదు. ఇప్పుడు తమ ఉనికిని చాటుకునేందుకు కోకాపేట్‌లో మూడు భవనాలలో శ్లాబులు తొలగించి చేతులు దులుపుకున్నారు. అధికారులకు చిత్తశుద్ధి ఉంటే ఇదే నార్సింగి మున్సిపాలిటీలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాలు, తీసుకున్న అనుమతుల కు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనాలు 50.కి పైగానే ఉంటాయని, వాటన్నింటిపై చర్యలు తీసుకొని తమ నిజాయితీని చాటు కోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


కోకాపేట్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఇంటి శ్లాబును కూల్చివేస్తున్న హెచ్ఎండిఏ, నార్సింగి మున్సిపల్ అధికారులు.

**అనుమతుల మేరకే నిర్మాణాలు చేపట్టాలి : కమీషనర్**

నార్సింగి మున్సిపల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టే బిల్డర్లు, ఇంటి యజమానులు మున్సిపల్ నుంచి గాని హెచ్ఎండిఏ నుంచి గాని పొందిన అనుమతి మేరకే నిర్మాణాలు చేపట్టాలని కమీషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అనుమతులు జి+2 పొంది నిర్మాణాలు జీ+5,6,7 వరకు చేపట్టడం చట్ట విరుద్ధమని, ఇలాంటి వారిపై మున్సిపల్ చట్టం ప్రకారం కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. గతంలో జరిగిన విషయాలపై నేను స్పందించనని, ఇప్పటి నుంచి ఎవరు చట్టంను ఉల్లంఘించినా ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు. స్థానిక ప్రజలుగాని, నాయకులుగాని, పౌరులుగాని మీ ప్రాంతాలలో అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే వెంటనే నా దృష్టికి తీసుకు రావాలని, మాకు సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని కమీషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి తెలిపారు.

### అనారోగ్యంతో అపార్ట్మెంట్‌పై నుంచి దూకి వృద్ధురాలు ఆత్మహత్య

**ఎల్.బి.నగర్, మే 23 ప్రభాతవార్త:** అనారోగ్య సమస్యలతో అపార్ట్మెంట్‌పై నుండి దూకి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం న్యూమారుతినగర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివాసముండే శశికళ(69) గత కొన్ని ఏళ్ల నుండి ఆస్తమాతో ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఉదయం వాకింగ్ కోసమని బయటికి వెళ్లి అపార్ట్మెంట్ పై నుండి దూకి ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. శశికళ కుమారుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### కుటుంబ కలహాలతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

**గచ్చిబౌలి, మే 23 ప్రభాతవార్త :** కుటుంబ కలహాలతో తీవ్ర మనస్థాపం చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఏఎస్ఐ రాంభూపా ల్‌రెడ్డి కథనం ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా ఎస్ఆర్ పురం మండలం చొక్కమడుగు గ్రామానికి చెందిన గోలి అశ్విన్‌కుమార్‌రెడ్డి(36) తన భార్య కోలా శ్రావ్యతో కలిసి గచ్చిబౌలి టెలికాంనగర్‌లో నివాసం ఉంటున్నాడు. శ్రావ్య సొంత గ్రామం గుంటూ రు జిల్లాలోని దాచేపల్లి కాగా, వీరికి గత సంవత్సరం నవంబరు 14వ తేదీన వివాహం జరిగింది. శ్రావ్య సైతం సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తుంది. వివాహం అనంతరం టెలికాం నగర్‌లో కాపురం పెట్టిన అశ్విన్‌కుమార్‌రెడ్డి, శ్రావ్యల మధ్య పిల్లలు కనడంపై తరచూ మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. భార్య గర్భం దల్చడం లేదనే విషయంలో భార్య, భర్తలు ఇద్దరి మధ్య గతకొంత కాలంగా గొడవలు అధికమయ్యాయి. ఇదే క్రమంలో గత రెండు రోజుల క్రితం సైతం ఇదే విషయమై భార్య,భర్తలు గొడవ పడ్డారు. కాగా బుధవారం మధ్యాహ్నం శ్రావ్య తన కార్యాలయానికి వెళ్లిపోగా, అశ్విన్‌కుమార్‌రెడ్డి ఇంట్లోనే ఉన్నాడు. ఆఫీసులో ఉన్న శ్రావ్యకు మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో అశ్విన్ తండ్రి మురళీధర్‌రెడ్డి ఫోన్ చేసి అశ్విన్ ఫోన్ తీయడం లేదని అప్రమత్తం చేశాడు. దీంతో హుటాహుటిన ఇంటికి వచ్చిన శ్రావ్య ఎంతగా తలుపు కొట్టినా లోపలి నుంచి గడియపె ట్టుకున్న అశ్విన్ తలుపు తీయలేదు. దీంతో తన వద్ద ఉన్న మరో తాళంచెవితో తలుపు తెరిచి చూడగా, ఇంట్లో ఉన్న సీలింగ్ ఫ్యాన్‌కు దోతీతో ఉరివేసుకొని అశ్విన్ కనిపించాడు. వెంటనే శ్రావ్య అపస్మారక స్థితిలో ఉన్న అశ్విన్‌ను స్థానికుల సహాయంతో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. దీంతో సమా చారం అందుకున్న రాయదుర్గం పోలీసులు అశ్విన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

### చేపల వేటకు వెళ్లి చెరువులో మునిగిన వ్యక్తి మృతి..

**కొంపల్లి, మే 23, ప్రభాతవార్త**

గురువారం ఉదయం 6:30 సమయంలో చేపల వేటకి వెళ్లి చెరువులో మునిగి సాయిలు (45) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిజాంపేట్ ఇందిరమ్మ కాలనీలో ఉంటున్న జి.సాయిలు గత 3 నెలలుగా యాదయ్య అనే వ్యక్తి దగ్గర చెరువులో చేపలు పట్టే పని చేస్తున్నాడు. రోజులాగే గురువారం ఉదయం సాయిలు, సుబ్బారెడ్డి, రాజు ముగ్గురు వ్యక్తులు నిజాంపేట్ వాటర్ ట్యాంక్ సమీపంలో ఉన్న శ్రీరామకుంట చెరువుకి చేరుకుని చేపలవేటకు చెరువులో చెరోపక్క దిగి చేపలు పట్టే సమయంలో సాయిలు ఒక్కసారిగా చెరువులో మునిగిపోయాడు. అది గమనించిన మిగతా ఇద్దరు వ్యక్తులు ఆయన కోసం చెరువులో గాలించగా ఆచూకీ దొరకకపోయేసరికి వెంటనే అక్కడ ఉదయం వాకింగ్‌కు వచ్చిన చుట్టు పక్కల వాళ్ళకి సమాచారం ఇవ్వగా వాళ్లు పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందజేశారు. వెంటనే ఫైర్ సిబ్బంది మహిపాల్, నిజాముద్దీన్, నాగరాజు, నవాజ్‌రెడ్డి, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని లాంగర్ సాయంతో శ్రమించి మృతదేహాన్ని బయటికి తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టు నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి మృతుడి అమ్మ వీరుడి శేఖమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి నుంచి గుండెమార్పిడి

-శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి చేసిన నిమ్స్ వైద్యులు


శస్త్ర చికిత్స పూర్తి చేసిన డాక్టర్ అమరేశ్వర్‌రావు ఆధ్వర్యంలోని వైద్యబృందం

**హైదరాబాద్,మే 23, ప్రభాతవార్త:** పంజాగుట్టలోని నిమ్స్ ఆసుపత్రి వైద్యుల బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి నుంచి విజయవంతంగా గుండెమార్పిడి చేశారు. ములుగు జిల్లా ఏటూరు నాగారం ప్రాంతానికి చెందిన షేక్ షనాజ్ (29) గుండె ఎడమ జఠరిక వద్ద ఏర్పడిన సమస్య (డైలేటెడ్ కార్డియోమయోపతి )తో గత రెండేళ్లుగా బాధ పడుతున్నారు. ఈసమస్య కారణంగా శరీరానికి కావాల్సిన రక్తాన్ని పంపింగ్ చేయడంలో గుండె పనితీరు మందగించింది. దీంతో ఆస్పత్రి కార్డియోథొరాసిక్ వైద్యులు అమరేశ్వర్‌రావు, గోపాల్‌ను సంప్రదించారు. పరీక్షించిన వైద్యులు గుండె మార్పిడి చేయాల్సి ఉంటుందని సూచించారు. అప్పటినుంచి ఆమె మందుల ద్వారా ఉపశమనం పొందుతున్నారు. గుండె మార్పిడి కోసం వైద్యులు సూచనల మేరకు జీవన్‌దాన్‌లో పేరు నమోదు చేయించుకుని అప్పటి నుంచి ఆమె అవయవదాత కోసం ఎదురు చూస్తున్నారు. రెండ్రోజుల క్రితం సికింద్రాబాద్ యశోధా ఆసుపత్రిలో ఓవ్యక్తి బ్రెయిన్‌డెడ్ అయినట్లు జీవన్‌దాన్ వైద్యబృందం గుర్తించింది. షనాజ్ రక్తనమూనాలు సరిపోవడంతో ఆమెకు గుండెమార్పిడి చేసేందుకు వైద్యులు ఏర్పాటు చేశారు. కార్డియోథొరాసిక్ విభాగాధిపతి అమరేశ్వర్‌రావు సారథ్యంలోని వైద్యబృందం మార్పిడి శస్త్ర చికిత్సను పైసా ఖర్చు లేకుండా విజయవంతంగాపూర్తి చేశారు. ఈసందర్భంగా నిమ్స్ డైరెక్టర్ బీరప్ప వైద్యబృందాన్ని అభినందించారు. కార్పొరేట్ ఆసుపత్రి వైద్యులకంటే వేగంగా నాణ్యమైన వైద్యసేవలను అందిస్తున్నట్లు గుర్తుచేశారు.

### వర్షాకాలంలో అత్యవసర సేవలు అందించాలి : తేలుకుంట

**కంటోన్మెంట్,మే 23 ప్రభాతవార్త:** రానున్న వర్షాకాలంలో కంటోన్మెంట్ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అత్యవసర సేవలు అందించేందుకు డిజాస్టర్ ఎమర్జెన్సీ టీమ్‌లను ఏర్పాటు చేయాలని కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్‌కు 5వ వార్డుకు చెందిన సామాజిక కార్యకర్త, కాంగ్రెస్ నేత తేలుకుంట సతీష్‌గుప్త వినతిపత్రం అందజేశారు. నాలాల్లో పెరుకుపోయిన మట్టిని తొలగించేందుకు డీషెల్టింగ్, డ్రైనేజీ మురుగునీరు సాఫీగా పోయేందుకు మరమ్మతులు చేపట్టాలని సిఈఓ దృష్టికి తెచ్చారు.

### అకాల వర్షాలపై ప్రభుత్వం స్పందించి, తక్షణ చర్యలు చేపట్టాలి

టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా

**ముషీరాబాద్, మే 23, ప్రభాతవార్త:** అకాల వర్షాలతో నగర ప్రజలు ఇబ్బందులు పడుతూ ఉంటే జీహెచ్ఎంసీ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, అకాల వర్షాలపై ప్రభుత్వం స్పందించి, తక్షణ చర్యలు చేపట్టాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. గురువారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయి, రవాణాకు అంతరాయం ఏర్పడుతున్నా జీహెచ్ఎంసీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అకాల వర్షాలతో డెంగ్యూ, మలేరియా, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది కాబట్టి వైద్యం కోసం అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులు, మందులు, సౌకర్యాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో చొక్కావాడి నాలా స్లాబ్, డబీర్‌పుర బ్రిడ్జ్ కూలిపోవటం వంటి సంఘటనలు దృష్టిలో పెట్టుకుని అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, వర్షాలతో ఎటువంటి ఆస్థి, ప్రాణ నష్టాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, కప్పు కృష్ణాగౌడ్, యాదగిరిరావు, భానుప్రకాష్, కిరణ్, రాజు, భిక్షపతిచారి తదితరులు పాల్గొన్నారు.

### పవిత్రమైన వైద్యవృత్తిని సేవాభావంతో చేయాలి : బండి రమేష్

**కెపిహెచ్‌బి కాలనీ, మే 23, ప్రభాతవార్త :** వైద్యో నారాయణ హరి అన్నట్లు ప్రతి వైద్యుడు సేవాభావంతో రోగులకు వైద్యం చేయాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్ అన్నారు. మూసాపేట కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎండి చున్ను పాషా ఆధ్వర్యంలో నవయువక యూత్ అసోసియేషన్ వద్ద ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని బండి రమేష్ గురువారం ప్రారంభించారు. అనంతరం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మహమ్మద్ మున్సినీ బండి రమేష్ అభినందించారు. షుగర్, థైరాయిడ్ పరీక్షలు నిర్వహించారు.

### విజయలక్ష్మి సాహితీ చంద్రిక ఆనంద అక్షర చంద్రిక

- విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి


సాహితీ చంద్రికను ఆవిష్కరిస్తున్న రమణాచారి, ఓలేటి, విజయలక్ష్మి, లలితవాణి తదితర అతిథులు

**రవీంద్రభారతి, మే 23 ప్రభాతవార్త :** ప్రముఖ రచయిత్రి డా. పులిగడ్డ విజయలక్ష్మి రచించిన సాహితీ చంద్రిక గ్రంథం కేవలం సాహితీ చంద్రికనే కాదు అదొక ఆనంద చంద్రిక, అక్షర చంద్రిక అని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి. రమణాచారి సమత్కరించారు. ఇది దర్భలమీద అమృతబిందువులు చిలకరించినట్లుండడంతోపాటు వ్యాసాలలో అదితి, దితి, ద్రౌపది, అత్రి, అగస్త్యుడు మొదలైన పురనానపాత్రలు, వృద్ధాప్యం ఒక శాపమా వంటి ప్రత్యేక వ్యాసాలు ఆమెలోని ఆధ్యాత్మిక, ఆస్తిక భావాలను, సమకాలీన సమాజ దృక్కోణాన్ని ఆవిష్కరిస్తాయని ప్రశంసించారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, సాహితీ జిగీష సాహితీ సాంస్కృతిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో డా. ఓలేటి పార్వతీశం సభాధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి రచయిత్రి డా. పి.విజయలక్ష్మి విశిష్ట అతిథులు డా. ఎం.దత్తాత్రేయశర్మ, ఆచార్య వెలుదండ నిత్యానందరావు, డా. శంకరనారాయణ, లలితవాణి తదితరులతో కలిసి సాహితీ చంద్రిక గ్రంథాన్ని ఆవిష్కరించి రచయిత్రిని ఘనంగా సత్కరించి అభినందించారు.

### ప్రపంచ వ్యాప్తంగా త్యాగరాయగానసభ విరాజిల్లుతోంది

-హాస్యబ్రహ్మ, సీనియర్ పాత్రికేయులు శంకరనారాయణ


అంజన గోలి రచించిన 'బెటర్ ట్రాజెక్టరీస్' గ్రంథాన్ని ఆవిష్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి,మే 23 ప్రభాతవార్త:** అన్ని దానాలకన్న అన్నదానం మిన్న అంటారని, కాని విద్యా, కళాదానం జీవితాలను నిలుపుతుందని హాస్య బ్రహ్మ, సీనియర్ పాత్రికేయులు శంకరనారాయణ అన్నారు. గురువారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో 16 సంవత్స రాల తెలుగు యువతి అంజన గోలి రచించిన 'బెటర్ ట్రాజెక్టరీస్' గ్రంథావిష్కరణ సభ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి అధ్యక్షతన గానసభలోని గుండవరపు హన్మంతరావు కళావేదికలో జరిగింది. ముఖ్యఅతిథిగా కళావిఎస్.జనార్దనమూర్తి హాజరై గ్రంథాన్ని ఆవిష్కరించిన సభలో శంకరనారాయణ మాట్లాడుతూ అమెరికాలో స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసిస్తూ పలు సేవా కార్యక్రమాలలో పాల్గొంటూ వ్యక్తిత్వవికాస, వ్యాసరచనతో సాహితీ సేద్యం చేస్తున్నారని ప్రశంసించారు. చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ ప్రపంచ వ్యాప్తంగా ఎంతో విరజిల్లుతోందని, అమెరికా, లండన్, ఢిల్లీలో ఉన్నటువంటి వారిని కూడా ఆకర్షిస్తోందన్నారు. ఏడు విభాగాలలో అంజన నేటి యువతరానికి మార్గనిర్దేశనం చేసే అంశాలు ప్రస్తావించారన్నారు. కళావిఎస్. జనార్దనమూర్తి మాట్లాడుతూ అంజన వారి సోదరితో కలిసి గానసభలో చిన్ననాట గీత శ్లోకాలు ఆలపించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సమావేశంలో గుంటూరు హిందూ కళాశాల తెలుగు శాఖాధ్యక్షుడు డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు, పాటల రచయిత, స్వరకర్త రాయారావు విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అన్నదానం ఒక్క పూట మాత్రమే కడుపునింపుతుందని, విద్యాదానం, కళాదానం జీవితాంతం కడుపునింపుతుందని అన్నారు.

## వర్క్ ఫ్రమ్ హోమ్ పేరుతో మోసం

-పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

**హైదరాబాద్, మే23, ప్రభాతవార్త:** వర్క్ ఫ్రమ్ హోమ్ పేరుతో యువతిని మోసం చేసిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో తాజాగా చోటు చేసుకుంది. ఆన్‌లైన్ ఉద్యోగం పేరుతో తనని మోసం చేశారంటూ శ్రీవల్లి అనే యువతి జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించింది. వివరాల్లోకి వెళ్తే, వెంవటగిరికి చెందిన కె.శ్రీవల్లి అనే యువతికి ఆరు నెలల క్రితం ఆన్‌లైన్ జాబ్ పేరుతో ఒక మెసేజ్ వచ్చింది. అందులో వర్క్ ఫ్రమ్ హోమ్ ద్వారా మంచి ఆదాయ మార్గం ఉందని పేర్కొనడంతో లింక్ ద్వారా ఆమె దరఖాస్తు చేసుకుంది. తొలుత అందులో ఇచ్చిన టాస్క్‌లు పూర్తి చేసిన బాధితురాలు స్వల్ప పెట్టుబడితో నాలుగు నెలల వ్యవధిలో రూ.10వేలు సంపాదించింది. దాంతో ఆమెకు నమ్మకం కుదరడంతో, ఎక్కువ మొత్తంలో ఆదాయాలు రావాలంటే రూ.92వేలు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుందని ఆన్‌లైన్ ఉద్యోగం ఇచ్చినవారు సందేశం పంపారు. వారి మాటలు నమ్మిన శ్రీవల్లి పలు దఫాలుగా ఆ మొత్తాన్ని పంపడంతో తమ అసలు రంగు బయట పెట్టారు సైబర్ నేరగాళ్ళు.ఆమె వాడే యాప్‌ని బ్లాక్ చేయడంతో పాటు తమ వెబ్‌సైట్ పని చేయకుండా చేశారు.దాంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు జూబ్లీ హిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### పెట్టుబడి పేరుతో కోట్ల రూపాయల మోసం

-జూబ్లీహిల్స్‌లో నమోదయిన చీటింగ్ కేసు

**హైదరాబాద్, మే23, ప్రభాతవార్త:** నిర్మాణ సంస్థని అడ్డు పెట్టుకుని పెట్టుబడి పేరుతో కోట్ల రూపాయలు మోసం చేసిన వారిపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదయింది. వివరాల్లోకి వెళ్తే, హైదర్‌నగర్‌కు చెందిన దాసరి వనమాల, వడ్లాలపు సునీతలకు ఒండేళ్ళ క్రితం జూబ్లీహిల్స్‌కు చెందిన జిఎస్ఆర్ ఇన్‌ఫ్రా గ్రూప్ సంస్థల యజమానులైన శిల్ప, గుంటులల్లి శ్రీనివాసరావు, అతడి భార్య జి.పద్మజ పరిచయమై, ఫార్మ్ ల్యాండ్ వెంచర్ పెట్టుబడులపై ఆశ చూపారు. నారాయణపేట వద్ద ఫార్మ్ ల్యాండ్ వెంచర్‌లో పెట్టుబడి పెడితే రెండేళ్ళలో రెట్టింపు లాభం ఇస్తామని నమ్మబలికారు. దాంతో బాధితురాళ్ళిద్దరూ కలిసి రూ.1.20 కోట్లను పెట్టుబడిగా పెట్టారు. ఈ మొత్తానికి గ్యారెంటీగా ఆరు పోస్ట్ డేటెడ్ చెక్కులను ఇచ్చారు. కానీ రెండేళ్ళ గడువు పూర్తయినా గానీ తమ డబ్బులు తిరిగి ఇవ్వకపోగా, ఫోన్లు కూడా ఎత్తడం మానేశారు. దీంతో వారి గురించి వాకబు చేసేందుకు బాధితురాళ్ళు ఇద్దరూ రోడ్ నెంబర్ 10 జూబ్లీహిల్స్‌లోని వారి ఆఫీసుకు వెళ్ళగా, నిందితులు శ్రీనివాసరావు, పద్మజ, శిల్పలు పరారీలో ఉన్నట్లు తెలుసుకున్నారు. విషయం తెలిసిన బాధితురాలు సునీత కుమారుడు పవన్ కుమార్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 420, సెక్షన్ 406 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ - సరూర్‌నగర్ సర్కిల్-5

నిట్ నెం.3/EE5/SRNR/GHMC/2024-25, తేది: 23.05.2024, పని పేరు: (1) సం. పనుల కొరకు "వాటర్ క్యాన్‌ల సరఫరా". అంచనా మొత్తం: రూ.4.70 లక్షలు. బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ, సమయం: 28.05.2024 మ.3.01 గం. అధికారి పేరు, చిరునామా, సెల్ నం: శ్రీ K. శ్రీనివాస్, EE, సరూర్‌నగర్ సర్కిల్-5, GHMC, (M): 9989930602. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://www.eprocurement.telangana.gov.in/ వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్‌నగర్ సర్కిల్-5, GHMC
DIPR.No.12214-PP/CL/Advt/1/2024-25, తేది: 23.05.2024

వార్త VAARTHA CLASSIFIEDS

LOSS OF DOCUMENTS

★ I, Sermoria Deepak Kumar S/o. Jagdamba Devi R/o.18-7-884/5, Out Side Gowlipura, Hyd, I have lost my Title Deed No.2429/1979 While I was travelling from Gowlipura to Uppuguda. If anyone found Contact- 9182559458

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.


**ప్రథమ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్**

**నిజాంపేట్, మే 23, ప్రభాతవార్త** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 11వ డివిజన్, కెనరా బ్యాంక్ ఎదురు రోడ్ నిజాంపేట్ శ్రీ అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకీ శ్రీ మహాలక్ష్మీ మహాకాళీ, మహా సరస్వతి, శ్రీ శక్తి స్వరూపిణి శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ తల్లి దేవాలయ పున: ప్రతిష్ఠాపనంతర ప్రథమ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని, ఆలయాల అభివృద్ధిలో ఎల్లప్పుడు ముందుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆవుల జగన్ యాదవ్, శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ తల్లి దేవాలయ ఆలయ కమిటీ చైర్మన్ నరసింహాచారి, కమిటీ సభ్యులు మహేంద ర్‌రెడ్డి,పాల్గొన్నారు.


**IN THE COURT OF THE HON'BLE I JUNIOR CIVIL JUDGE : CITY CIVIL COURTS : AT: SECUNDRABAD. O.S.NO. 303 OF 2024**
Between:
1) Paspulate Irene,
2) P. Valentina Dior, ...Plaintiffs
AND
1. The Tahsildar, Mandal Revenue office, Near Fire Station, Secundrabad, Second Floor, Secundrabad, Hyderabad, Telangana 500003.
1. To Whomsoever it may ever concern ...Defendants
**NOTICE**
The above named Plaintiff have filed suit for declaration, to declare the Plaintiff is the legal heir of Late P. Sirish Kumar. The Plaintiff are the only legal heirs to Late.P. Sirish Kumar In this regard the Hon'ble court posted the above **O.S. 303/2024 on 13-06-2024 at 10:30 A.M.** If anybody have got any objection for grant of the above relief in favor of the Plaintiff, they may file their objections before the Hon'ble court on the said date. Hence the concern hereby informed to appear before the said court either in person or through an advocate, failing which the case will be heard determined exparte.
(BY ORDER OF THE COURT)
**M/s A. SATYAVATHI, SUNITHA**
**Advocates**
Flat No 202, Sri Hari Vasantha Nilayam, Athapur, Rajendranagar,
**Cell: 8978669993**

**IN THE COURT OF THE HON'BLE XI-ADDL. JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT: SECUNDERABAD. O. S. No. 282 of 2024**
Between:
1) **Sri. Lakkaraju Chandra Sekhara Rao** S/o. Sri. L. Umamaheshwara Rao, age 71 years, Occ: Retd. Employee, Aadhaar No. xxxx xxxx 3232)
2) **Smt. Lakkaraju Sailaja,** D/o. Sri. L. Chandra Sekhara Rao, age 37 years, Occ: Employee, (Aadhaar No. xxxx xxxx 8598) Both are R/o. H.No.12-1-508/B/71, Road No.1, Sripuri Colony, Behind Railway Quarters, Moulali, Secunderabad, Hyderabad-500040. ...Plaintiffs
AND
1) **The Tahsildar,** Marredpally Mandal Revenue Office, Hyderabad District, Office at Ridgewood Residency, St. No.7, Aswini Colony, West Marredpally, Secunderabad, Telangana 500026
2) All Concerned ... Defendants
To,
All Concerned,
Whereas the above named plaintiffs have filed the above suit for seeking to declaration to declare them as the Legal Heirs and successors of Late. Smt. Raja Rajeswari Lakkaraju @ Ganga Raju Raja Rajeswari, who died on 22-10-2023, wherein the Hon'ble court was pleased to pass orders by permitting the plaintiffs to serve substitute service of summons to the 'All Concerned'. Hence you are here by directed to be present before the above said court on 11-06-2024, at 10.30 A.M., either in person or through Advocate, failing which the matter will be decided ex-parte against you.
**(BY ORDER OF THE COURT)**
**Sd/-. T. KIRAN KANTH REDDY**
**ADVOCATES**
H.No.11-15-146/1, Flat No.G-1, Sai Ayyappa Nilayam, J.B.Colony, Road No.3, Saroornagar, Hyderabad -35,
**Ph.No.9246164335**

**IN THE COURT OF THE HON'BLE XI JUNIORCIVIL JUDGE : CITY CIVIL COURT AT : SECUNDERABAD O.S NO.269 OF 2024**
**1. T.V.S. SIVARAMA KRISHNA**
**2. T.V.S. SAI KIRAN**
**3. T.V.S. SAI PRAVEEN** ....Plaintiffs
AND
1) **Mandal Revenue Office,** Addagutta, Secunderabad
2) **All Concerned** ...Defendants
To,
**All Concerned**
Please take notice that the above suit is filed by the Plaintiffs to grant Legal Heir Certificate being the only legal heirs of the deceased Smt. T. SITA W/o. T.V.S. Sivarama Krishna and the same is posted to **11/06/2024** for appearance in the abovesaid Court at **10:30 a.m** if anyone wants to defend the said suit shall attend the court in person or through counsel. Take notice that in default of your appearance on the day before mentioned the suit will be heard and determined.
(BY ORDER OF THE COURT)
**J. JEEVAN BABU**
**J.TARUN**
**Advocates**
Plot No.6, Mahalakshmi Colony Behind Srinagar Colony, Tirumalgiri, Secunderabad
**Ph: 9246346458**
**Counsel for Plaintiffs**

**IN THE COURT OF THE XI JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT: AT SECUNDERABAD O.S.No. 353 of 2024**
BETWEEN:
**K. Ratna Kumari** ...Plaintiff
And
**The Tehsildar and another.** ...Defendants
To
**All Concerned**
Take notice that the Plaintiff had filed the above suit for Declaration, to declare the plaintiff as a legal heir of Late. K. Anil Kumar, against all concerned and the same is posted to **19-06-2024** for appearance before the Hon'ble Court. If any person having claim or objection may kindly appear before this Hon'ble Court either in person or through an Advocate on **19-06-2024, at 10.30 A.M.** Otherwise the matter will be heard and decided exparte.
(BY ORDER OF THE COURT)
**S. Samuel Kiran Kumar,**
**Advocate**
H.No.12-8-280, Sangha Cottage, AllugaddaBavi, Mettuguda, Secunderabad - T.S.
**9849935245**

**DEBTS RECOVERY TRIBUNAL-II Ist FLOOR, TRIVENI COMPLEX, ABIDS, HYDERABAD OA No. 859 OF 2023**
Between
**State Bank of India,** Small & Medium Enterprises Centre (SMEC) Secunderabad ...**Applicant**
Verses
**M/s. Hamsa Group,** Rep. by its Prop. Dr. H. Nagendra ...**Respondent**
**SUMMONS BY PAPER PUBLICATION FOR SHOWING CAUSE AS TO WHY THE RELIEF PRAYED SHOULD NOT BE GRANTED**
**M/s. Hamsa Group,** Rep. by its Prop. Dr. H. Nagendra H.No. 1-8-1/B1/F1, Phase I, Near Sundarayya Park, Bagh Lingampally, Hyderabad-500044.
Take notice that the Applicant has instituted the above application under Section 19 of the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 against the above named Defendants for recovery of a sum of **Rs.29,63,623/-** (Rupees Twenty Nine Lakhs Sixty Three Thousand Six Hundred and Twenty Three only)together with current and future interest, costs and for other reliefs.
The above mentioned Defendants are therefore hereby directed to appear before this Tribunal in person or through an Advocate or duly authorised agent, in support of his defense to show cause on **24-06-2024at 10.30 AM,** as to why reliefs prayed for should not be granted.
Take Notice that in case of default the application will be heard and determined in your absence.
*Given under my hand and seal of this Tribunal on this the... **day of April, 2024***
**ASST. REGISTRAR**
**Debts Recovery Tribunal-II**
Ist Floor, Triveni Complex, Abids, Hyderabad.

**IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT AT MEDCHAL I.A.NO. 788 OF 2023 IN 0.S.NO. 300 OF 2018.**
Between:
**Sri. Julakanti Laxma Reddy and another ...Petitioner/Defendant No.2 & 3**
AND
**Sri. P. Madhusudan Reddy and 2 others ...Respondents/Plaintiffs**
AND
**Sri. T. Rama Subba Reddy ...Respondent/Defendant No.1**
To,
1. **Smt. P. Shailaja Reddy,** W/o. P. Madhusudhan Reddy, Aged about 52 years, Occ: House wife, R/o. Plot No. 25, Green Avenues, Nizampet, Kukatpally, Hyderabad.
2. **P. Akhila Reddy,** D/o. P.Madhusudhan Reddy Aged about 27 years, Occ: Pvt Employee, R/o. Plot No.25, Green Avenues, Nizampet, Kukatpally, Hyderabad.
3. **Sri. T. Rama Subba Reddy,** S/o. T. Gousi Reddy, Aged about 58 years, Occ: Business, R/o. Plot No. 26, Pollampally Villas, Nizampet, Kukatpally, Hyderabad.
**...Respondents/Plaintiff No. 2 & 3/ Defendant No.1**
The Petitioner/Defendant No.2 & 3 filed the said Interlocutory application under order IX, Rule 7, R/W Section 151 of CPC against you and other Respondent/ Plaintiff/Defendant and the said matter is posted to **04-06-2024** for your appearance. You are therefore hereby directed to appear before this Hon'ble Court on the above said date at **10.30 A.M.** either in person or through your counsel, failing which the matter will be decided in your absence as per law.
// BY ORDER OF THE HONOURABLE COURT //
**Sd/- G. VAMSHI KRISHNA, Advocate**
Flat No.301, 3rd Floor, Lake Melody Apartments, H.No. 6-3-1099/14/15, Lane Behind The Park Hotel, Raj Bhavan Road, Somajiguda, Hyderabad - 500 082.
**Phone: 040-35970700, Mobile: 9985243004, E-mail: vamshi@kvbpartners.in**

**IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT SECUNDERABAD O.S.No. 264 of 2024**
BETWEEN:
**Singamshetty Prashanthi and Other's ...Plaintiff's**
AND
**The Tahsildar and All Concerned ...Defendant's**
To
**All Concerned ...Defendant No.2**
Whereas the Plaintiff named above has filed the suit to be declared as the Legal Heir of Late Singam Shetty Madhusudhan Naidu and the Hon'ble Court has issued Summons to you and posted the matter to 07.06.2024 for your appearance.
You are hereby directed to appear in the aforementioned matter at **10.30 AM on 07.06.2024** either in person or through Counsel, failing which the matter will be decided on merits in your absence, as per law.
//BY ORDER OF THE COURT//
**Sd/- K. MURALI MOHAN**
**Advocate**
12-11-131/A, Matrusri Nilayam, IInd Floor, Namalagundu, Sithaphalmandi, Secunderabad-61.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన వసతులు కల్పించాలి : జిల్లా కలెక్టర్



కొనుగోలు కేంద్రంవద్ద రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక్ తదితరులు

## ధాన్యం తీసుకున్న వెంటనే టోకెన్‌లు అందజేయాలి

## అధికారులు ప్రతి రోజు ట్రాక్ షీట్ పరిశీలించాలి

**అబ్దుల్లాపూర్‌మెట్, మే 23 ప్రభాతవార్త:** అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాచారం గ్రామంలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ శశాంక్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతుల సౌకర్యార్థం కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. ధాన్యం తరలించిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు, ధాన్యానికి తరుగు ఏమైనా తీస్తున్నారా అని రైతులను ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులుంటే అధికారులకు తెలియచేయాలన్నారు. రైతులు ధాన్యం తీసుకువచ్చిన వెంటనే తూకం జరిపించాలని అధికారులకు సూచించారు. సేకరించిన ధాన్యాన్ని వెంటనే లోడ్ చేయించి, రైతుల నుండి ధాన్యం తీసుకున్న వెంటనే టోకెన్‌లు అందించాలన్నారు. కేంద్రాల వద్ద సరిపడా సంఖ్యలో హమాలీలు సేవలందించేలా ఏర్పాట్లు ఉండాలని, రైస్ మిల్లులవద్ద కూడా ధాన్యంలోడ్‌లతో కూడిన లారీలు నిలిచి ఉండకుండా ఎప్పటికప్పుడు ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకునేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు. ధాన్యం తరలింపులో జాప్యానికి తావులేకుండా చూడాలని, ధాన్యం నిల్వలు తరలించేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో సరిపడా టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, ప్యాడి క్లీనర్లు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అకాల వర్షాల కురుస్తుండడంతో రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కాకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని, ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తి స్థాయిలో మద్దతు ధర చెల్లించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రైతులు తొందరపడి దళారులను ఆశ్రయించి నష్టపోవద్దన్నారు. వర్షాల వల్ల ధాన్యం తడిచిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత సీజన్‌లో 33 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, 17 కేంద్రాల ద్వారా వరిధాన్యం సేకరణ జరుపుతున్నామని, ఎక్కడ కూడా తరుగు వంటివి లేకుండా గట్టి చర్యలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. కేంద్రాలలో రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలూ అందుబాటులో ఉంచామని, ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే రైతులు నేరుగా జిల్లా అధికారుల దృష్టికి తేవచ్చని, జిల్లా స్థాయిలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో క్షేత్రస్థాయి సిబ్బంది మొదలుకుని అధికారుల వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు డిసిఓ ధాత్రిదేవి, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి మనోహర్ కుమార్ రాథోడ్, సివిల్ సప్లయిస్ డీ.ఎం విజయలక్ష్మీ, అబ్దుల్లాపూర్మెట్ తహశీల్దార్ సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటి నేతలు, భక్తులు

**ఉప్పల్, మే 23 ప్రభాతవార్త :** ఉప్పల్ బీరప్పగడ్డలోని శ్రీ తేనే లక్ష్మి నరసింహస్వామి కల్యాణోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవాలయ కమిటి నేతలు గోపు ఆనంద్, పిట్ట శ్రీనివాస్, సామల శ్రీనివాస్, ఎం.సత్యనారాయణ, కె.ఇంద్రసేనారెడ్డి, ఎం.జగన్, మహేందర్, సత్తిరెడ్డి, ఆలయ అర్చకులు భాష్యం శ్యామ్‌కుమారాచార్యులు తదితరుల ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం ప్రత్యేక అభిషేకం, స్వామి వారి కల్యాణం, అన్నదానం, స్వామి వారి పల్లకి ఊరేగింపు నిర్వహించారు. అభిజిత్ లగ్నంలో నిర్వహించిన ఈ కల్యాణోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆలయంలో ప్రతి ఏటా ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉత్సవాలకు భక్తులకు పెద్ద ఎత్తున తరలివస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆలయ కమిటి నేతలు, భక్తులు పాల్గొన్నారు.

## ఈటల గెలుపు కోసం శ్రీశైలంలో పూజలు

**ఉప్పల్, మే 23 ప్రభాతవార్త :** మల్కాజిగిరి పార్లమెంట్‌లో ఈటల రాజేందర్ విజయం సాధించాలని బిజెపి అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్ ఆధ్వర్యంలో పలువురు పార్టీ నేతలు శ్రీశైలం వెళ్లి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలచందర్, సీనియర్ నాయకులు పాల్వంచ విఠల్, సంఘీ స్వామియాదవ్, విద్యాసాగర్, శామీర్‌పేట చంద్రయ్య, మాధవరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పి.సాయిలు, బి.చంద్రశేఖర్, దుర్గ కృష్ణ, ఓర్సు శేఖర్, ఆలే నరేందర్, ముత్యాల కృష్ణారెడ్డి, టి.కిరణ్, చోటేమియా, లక్ష్మిన్, నరసింహారెడ్డి, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రధాని మోడీ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మల్కాజిగిరిలో ఈటల రాజేందర్ భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

## ఘనంగా లక్ష్మీనరసింహస్వామి జయంతి



రంగ నరసింహంగుప్తను సన్మానిస్తున్న కృష్ణారెడ్డి

**ఎల్.బి.నగర్, మే 23 ప్రభాతవార్త :** చైతన్యపురి డివిజన్ యాదాద్రి ఆలయం క్రింద వున్నా ఫణిగిరికాలనీ శ్రీలక్ష్మినరసింహస్వామి మందిరంలో నరసింహ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి జయంతి వేడుకలలో చైతన్యపురిడివిజన్ కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా పాల్గొని స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేటర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బిజెపి అధ్యక్షుడు వినోద్‌యాదవ్, రాకేష్, రామ్మోహన్, దేవాలయ కమిటీ సభ్యులు ప్రభు, సుధాకర్‌గుప్తా, అశోక్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## బుద్దుడి బోధనలు అనుసరించాలి : శ్రీవాస్తవ్



అడిషనల్ కమీషనర్ శ్రీవాస్తవ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న డా.లక్కరాజు నిర్మల

**తార్నాక, మే 23 ప్రభాతవార్త :** సామాజిక శాంతి, అభివృద్ధి కోసం గౌతమ బుద్దుడి బోధనలను అనుసరించాలని జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమీషనర్ శ్రీనివాస్ శ్రీవాస్తవ్ సూచించారు. తార్నాకలోని ప్రఫుల్ల మెమోరియల్ ట్రస్ట్, ఆవా కేర్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తార్నాకలో మజ్జిగ పంపిణీ, చలివేంద్రం పంపిణీ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అడిషనల్ కమీషనర్ శ్రీనివాస్ శ్రీవాస్తవ్ పాల్గొని నిర్వాహకులు డా. లక్కరాజు నిర్మలను అభినందించారు. 40 సంవత్సరాలుగా ఉచిత సేవలను అందిస్తున్న ప్రఫుల మెమోరియల్ ట్రస్ట్ ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఇంకా సమాజహితంకోసం మరిన్ని కార్యక్రమాలను చేసేలా భగవంతుడు వారికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కల్పించాలన్నారు. అనంతరం బుద్ద పౌర్ణమి వేడుకలను కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా.లక్కరాజు నిర్మల నర్సింహ్మారావు, ఓంప్రకాష్, ఫణి భూషణ్ లత, రమా, రమ్మ, మట్టం లత, కళ్యాణి తధితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ సర్కిల్‌లో విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఉప్పల్, మే 23 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ఉప్పల్, రామంతాపూర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఉప్పల్ భగాయత్ ఎఇ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. 11 కెవి దేవేందర్‌నగర్ పీడర్ పరిధిలోని దేవేందర్‌నగర్, లక్ష్మినారాయణకాలనీ, ఐడిఏ తదితర ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు, అదే విదంగా 11 కెవి శిల్పారామం ఫీడర్ పరిధిలోని శిల్పారామం, ఉప్పల్ భగాయత్, డిమార్ట్, నాగోల్ మెట్రో, గ్రీన్‌విచ్ అపార్ట్‌మెంట్, భారత్ పెట్రోల్ బంక్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు, 11 కెవి నవభారత్ పీడర్ పరిధిలోని నవభారత్, చవ్వేద, అశోక్ లేలాండ్, మాడ్రన్ బేకరి, ఎన్‌ఆర్‌బి బేకరి, అమృతాంజన్ తదితర ప్రాంతాల్లో సాయంత్రం 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

**ఉప్పల్ పరిధిలో..** ఉప్పల్ ఎగ్‌ఉడ్ పీడర్ పరిధిలోని స్టేడియం రోడ్, ఐడిఏ మున్సిపల్, స్ట్రీట్‌నెం.8 పరిధిలోని ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటలవరకు, సర్వే కాలనీ, స్కైవాక్, జెన్‌ప్యాక్ట్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 13.30 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు, కల్యాణపురి పరిధిలోని జాహిద్‌నగర్, బ్యాంక్ కాలనీ, ఇందిరానగర్, అంబేద్కర్‌నగర్, సీతారామకాలనీ, ఈస్ట్ కల్యాణపురి, బాలాజీ ఎన్‌క్లేవ్, రాఘవేంద్రకాలనీ, టీచర్స్ కాలనీ, అజ్మద్‌కాలనీ, విస్తార్ కాలనీలో సాయంత్రం 3.30 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

## ఘనంగా బుద్ధుడి జయంతి : చింతల



బుద్ధుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చింతల సురేంద్రనాథ్‌యాదవ్

**ఎల్.బి.నగర్, మే 23 ప్రభాతవార్త :** ప్రపంచంలోని కోట్లాదిమంది ప్రజలకు గౌతమ బుద్ధుడు ఆదర్శప్రాయుడని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేంద్రనాథ్‌యాదవ్ పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ సౌత్ అండ్ పార్క్ వద్ద గౌతమ బుద్ధుడు జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమానికి చింతల ముఖ్యఅతిథిగా హాజరై బుద్ధుడి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానాన్ని ఒక పనిగా చెయ్యకు, ప్రతి పనినీ ఒక ధ్యానంగా చేయాలన్నారు. వెయ్యి పనికి రాని మాటల కంటే మిమ్మల్ని శాంతియుతంగా మార్చే ఒక్క మంచి మాట మేలుఅని గౌతమ బుద్ధుడు చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బుద్ద పూర్ణిమ వేడుకలు : ఐలయ్య



బుద్ద విగ్రహానికి ఘనంగా పూలమాల వేసిన కొసికె ఐలయ్య తదితరులు

**తుర్కయంజాల్, మే 23 ప్రభాతవార్త :** బుద్ద పూర్ణిమ సందర్భంగా తుర్కయంజాల్ మున్సిపాలిటీ మాసాబ్ చెరువు కట్టపైన ఉన్న బుద్ధుని విగ్రహానికి కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కొశికె ఐలయ్య, రంగారెడ్డి జిల్లా బిజెపి ఎస్సీ మోర్చా అధ్యక్షులు బచ్చిగళ్ళ రమేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోధి నీడలో కొలువైన బోధ సత్వుడు వైశాఖ పౌర్ణమి దినమున జన్మించారని పేర్కొన్నారు. ఈ మహా ముని సగటు మనిషిని సంఘం నుండి వెలవేస్తుంటే చూసి తట్టుకోలేక సంపదలు, భోగభాగ్యములను తిరస్కరించి సహజమైన జీవనం గడిపిన గొప్ప త్యాగశీలి సిద్ధార్థుడని, సర్వ జీవకోటి సర్వజీవులు సమానమని బోధించి గౌతమ బుద్ధుడయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రాజునాయక్, దూదిమెట్ల వెంకటేష్‌యాదవ్, బాయ్‌ముత్క శ్రీనివాస్, వేముల శంకర్, ఎండి షఫీ, గిరి, ఉపేందర్, రాములు, హనుమంత్‌రెడ్డి, వెంకటేష్, శ్రీశైలం నాయక్, మరియు వివిధ కాలనీల సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**తుర్కయంజాల్, మే 23 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో 11కెవి ఫీడర్లకు అంతరాయం కలుగకుండా చెట్ల కత్తిరింపులపై శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఇంజాపూర్ ఎఇ ఆపరేషనల్ అధికారి తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ సరఫరాలో స్వల్ప వ్యవధిలో అంతరాయం ఏర్పడుతుందని కాలనీవాసులు సహకరించాలని విద్యుత్ అధికారులు కోరారు. 11కెవి ఇందిరమ్మ కాలనీ ఫీడర్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ, సాయి ప్రియ కాలనీ, అంజనాపురి కాలనీలలో 11 గంటల నుండి 1 గంటల వరకు, 11కెవి ఆపిల్ అవెన్యూ ఫీడర్ పరిధిలోని ఆపిల్ అవెన్యూ కాలనీ, ప్రకాష్ నగర్, మిధానికాలనీ, సుందరయ్య కాలనీ, లక్ష్మీనగర్ కాలనీ, తిరుమలనగర్, శ్రీరంగాపురం, సాయినాథ్ కాలనీలలో 11:00 గంటల నుండి 1:00 గంటల వరకు, 11కెవి సిఆర్‌పిఎఫ్ ఫీడర్ పరిధిలోని సిఆర్‌పిఎఫ్ కాలనీ, నీలాద్రి నగర్, సాయి దయాకాలనీ, స్నేహపురి కాలనీ, దుర్గా నగర్, తుల్జాభవాని కాలనీ, వెంకటేశ్వర కాలనీలలో 3:00 గంటల నుండి 15:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

## కనుల పండువగా శ్రీవారి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న రాజా సంజయ్ గోపాల్ సైంచర్, కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి, ఇఒ శ్రీనివాస్‌రెడ్డి, ధర్మకర్తలు

**సరూర్‌నగర్, మే 23 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోనే ఉత్తర ద్వారం ఉన్న అరుదైన పురాతన దేవాలయంగా గుర్తింపు పొందిన జిల్లెలగూడలోని మత్స్యావతార శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీవారి అధ్యయనోత్సవ సహిత పాంచాహ్నిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారి రథోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయ ఇఒ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ వ్యవస్థాపక ఫ్యామిలీ మెంబర్ రాజా సంజయ్ గోపాల్ సైంచర్, కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి, తాజా మాజీ ధర్మకర్తలు బొమ్మరబోయిన యాదగిరి ముదిరాజ్, పోరెడ్డి జంగారెడ్డి, చింతపట్ల జ్ఞానేశ్వరచారి తదితరుల పర్యవేక్షణలో రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంప్రదాయం ప్రకారం ఆలయ పరిసరాల్లో పుర వీధుల గుండా మంగళ వాయిద్యాల మధ్య సుందరంగా అలంకరించిన స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. రథోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ, కాలనీల మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు, శ్రీవారి భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

## చెరువులోని వ్యర్థాలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి : కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్



చెరువును శుభ్రం చేస్తున్న ప్రేమ్‌మహేశ్వర్ రెడ్డి

**ఎల్.బి.నగర్, మే 23 ప్రభాతవార్త :** సరూర్‌నగర్ చెరువులో నుండి వ్యర్థాలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి సూచించారు. ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో సరూర్‌నగర్ చెరువులోనుండి వ్యర్థాలను తొలిగించే పనులను ఎంటమాలజీ సిబ్బంది అర్జున్‌తో కలిసి కార్పొరేటర్ గురువారం పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రేమ్ మాట్లాడుతూ చెరువులో నుండి తరుచు వ్యర్థాలను ఎంటమాలజి విభాగం వెంటవెంటనే తొలగించినా మళ్లీ చుట్టూ పక్కల ప్రజలు, అక్కడి విధి వ్యాపారులు చెత్తను చెరువులో పారేయడం వలన విపరీతమైన చెత్త చెరువులో పేరుకుపోదుందన్నారు. చెరువు చుట్టూ జాలి ఏర్పాటు చేసి చెత్తను చెరువులో వేయకుండా కట్టడి చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం లేదన్నారు. చెరువులో వ్యర్థాలు ఎక్కువ కావడంతో గడ్డిఅన్నారంవాసులు దోమల బెడదతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు సుందరీకరణకు నిధులు కేటాయించి పనులు మొదలు పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు అశోక్, రఘు, బీజేపీ సీనియర్ నాయకులు చిలకూరి రామ్‌రెడ్డి, రఘునందన జోషి, గిరీష్‌గౌడ్, శశాంక్ నాయుడు, టింకు పాల్గొన్నారు.

## ఘనంగా మార్షల్ ఆర్ట్స్ కరాటే పోటీలు



బహుమతులు అందజేస్తున్న సినీహీరో సుమన్ తదితరులు

**ఉప్పల్, మే 23 ప్రభాతవార్త :** మెగా ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ కరాటే క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించారు. ఆర్గనైజర్ సాయికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ క్రీడా పోటీలలో తెలంగాణలోని హబ్సిగూడకు చెందిన కెడిఆర్ బ్లిట్స్, టైక్వాండ అకాడమీ విద్యార్థులు కట్టస్, కొమ్ముతే విభాగంలో 5 బంగారు పతకాలు, 3 వెండి పతకాలు సాధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ హీరో సుమన్ విచ్చేసి క్రీడాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే క్రీడల పట్ల అసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడాకారులకు ప్రభుత్వం నుంచి తగు చేయూత అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

## లక్ష్మిదేవమ్మకు సిపిఎం నేతల పరామర్శ

**ఉప్పల్, మే 22 ప్రభాతవార్త :** స్వాతంత్ర్య సమరయోధులు స్వర్గీయ ఎం.వి. శ్రీహరి సతీమణి లక్ష్మిదేవమ్మ అనారోగ్యం భారిన పడడంతో సిపిఎం నేతలు ఆమెను పరామర్శించారు. బుధవారం రామంతాపూర్‌లోని ఆమె నివాసంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నర్సింగ్‌రావు, జిల్లా కార్యదర్శి సత్యం, కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, ఎం.వినోద, ఉప్పల్ సిపిఎం నేతలు జె.వెంకన్న, వెంకటేశ్వర్లు, భీష్మాచారి తదితరులు పాల్గొని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష్మిదేవమ్మ త్వరగా కోలుకోవాలని అకాంక్షించారు. పాల్గొన్నారు.

## తార్నాక చౌరస్తా వద్ద అక్రమ నిర్మాణాన్ని తొలగించిన జీహెచ్‌ఎంసీ అధికారులు



తార్నాక చౌరస్తాలో ఫుట్‌పాత్‌పై అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న అధికారులు

**తార్నాక, మే 23 ప్రభాతవార్త :** సికింద్రాబాద్ సర్కిల్ 29 డిప్యూటీ కమీషనర్, జోనల్ కమీషనర్ అదేశాల మేరకు గురువారం టౌన్ ప్లానింగ్ అధికారులు తార్నాకలో అక్రమ నిర్మాణాన్ని తొలగించారు. తార్నాక చౌరస్తావద్ద ఇటీవల హెచ్‌పి పెట్రోబంక్ యజమాని ఫుట్ పాత్‌ను ఆక్రమించడంతో పాటు ఇతర నిర్మాణాన్ని చేపట్టాడు. దీంతో విషయం తెలుసుకున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించారు. ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన నిర్మాణాన్ని బోర్డును తొలగించారు. ఏసీపీ రజిత, టీపీఎస్ సరిత, సిబ్బంది ప్రకాష్, మౌనిక, చైన్ మెన్‌లు నాగయ్య, ఆంజనేయులు, చంద్రశేఖర్ తదితరులు అక్రమ నిర్మాణాన్ని తొలగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విద్యా సంస్థపై చర్య తీసుకోవాలని వినతి





శ్రీదేవికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

**ఎల్.బి.నగర్, మే 23 ప్రభాతవార్త:** ఇంటర్ బోర్డ్ నిబంధనలను ఉల్లంగిస్తూ అక్రమంగా వేసవి తరగతులు నిర్వహిస్తున్న శ్రీచైతన్య కళాశాలను సీజ్ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఇంటర్ బోర్డ్ నిబంధనలను ఉల్లంగిస్తూ అక్రమంగా వేసవి తరగతులు నిర్వహిస్తున్న ఆర్.కె.పురం డివిజన్ అల్కాపురి కాలనీలోని శ్రీచైతన్య కళాశాలను సీజ్‌చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని, కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవడంలో ఇంటర్ బోర్డ్ విఫలం చెందిందని డిమాండ్ చేస్తూ శ్రీచైతన్య కళాశాల వద్ద గురువారం తరగతులను బహిష్కరించి, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ ధనార్జనే ధ్యేయంగా కాసుల కక్కుర్తితో విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మోసం చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నమన్నారు. కళాశాల వసతి గృహానికి అనుమతులు లేకున్నా అమ్మాయిలకు, అబ్బాయిలకు తరగతులు ఒకే గది ఏర్పాటు చేశారని ఆరోపించారు. కళాశాలలో లక్షలాది రూపాయలు ఫీజుల రూపంలో వసూళ్లు చేస్తున్న విద్యార్థులకు సరైన మరుగుదొడ్లు లేవని, నాణ్యత లేని ఆహార పదార్థాలను విద్యార్థులకు ఇస్తున్నారన్నారు. కళాశాలపై చర్యలు తీసుకోవాలని 15 రోజుల క్రితమే జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి శ్రీదేవికి ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, టి.సత్యప్రసాద్, మాజీద్, నరేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ బిఆర్‌ఎస్ డివిజన్ కమిటీలు రద్దు : ఎమ్మెల్యే

**ఉప్పల్, మే 23 ప్రభాతవార్త :** బిఆర్‌ఎస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులతోపాటు, పార్టీ అనుబంధ సంఘాల కమిటిలను రద్దు చేస్తున్నట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. బిఆర్‌ఎస్ పార్టీ అన్ని డివిజన్ కమిటి నేతలతోపాటు, యూత్, మహిళా, బిసి, ఎస్సీ, ఎస్టీసెల్, బిఆర్‌ఎస్‌వి కమిటిలు కూడా రద్దు చేసినట్లు ఆయన తెలిపారు. బిఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు త్వరలోనే అన్ని డివిజన్ నూతన కమిటిలు ఎన్నుకుంటామని తెలిపారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు.

## ప్రత్యంగిరా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న జబర్దస్త్ ఫేమ్ వేణు



నటుడు, దర్శకుడు వేణుకు అమ్మవారి జ్ఞాపికను అందజేస్తున్న శ్రీనివాస్

**ఎల్.బి.నగర్, మే 23 ప్రభాతవార్త :** ఆర్కేపురంలోని కుర్తాళం పీఠం శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి అమ్మవారిని బలగం సినిమా దర్శకులు, నటుడు, జబర్దస్త్ ఫేమ్ వేణు దంపతులు గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. వేణు మాట్లాడుతూ ప్రత్యంగిరా అమ్మవారు చాలా శక్తి దేవతని, అమ్మవారి మహిమలు ప్రపంచమంతటా వ్యాప్తి చెందాయని తెలిపారు. ఎండు మిరపకాయలతో జరుగు హోమం చాలా మహిమ కలదని తెలిపారు. కుర్తాళం పీఠాధిపతులు జగద్గురువులు శ్రీసిద్దేశ్వరానంద భారతి మహాస్వామి వారు ప్రత్యంగిరా సాధన, వారాహిసాధన, కాళీసాధన, కాలభైరవ సాధన, దశమహావిద్య సాధనలను ప్రపంచవ్యాప్తంగా భక్తులకి తెలియజేస్తున్నారని తెలిపారు. ఆలయ సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్, సువర్ణలత దంపతులు వేణుకి అమ్మవారి జ్ఞాపికను అందచేశారు. కార్యక్రమములో విఠల్‌శర్మ, అరుణ, సాయికుమార్‌శర్మ, బనగిరి నాగరాజు, హేమంత్, శ్రీపతి, రామశర్మ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలలో డ్రైనేజీ సమస్యలను తక్షణమే పరిష్కరిస్తాం : కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి



మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్

**హయత్‌నగర్, మే 23 ప్రభాతవార్త:** కాలనీల్లో డ్రైనేజీ సమస్యలను తక్షణమే పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఉషోదయ కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్లు చెత్తచెదారంతో నిండిపోయి మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు నీరు పొంగి రోడ్లపై ప్రవహిస్తోందని కాలనీవాసులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన గురువారం కాలనీలో పర్యటించి సమస్యను స్వయంగా పరిశీలించారు. మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుండడంతో దుర్గంధం వ్యాపిస్తోందని, దోమలు ఎక్కువై వ్యాధులు ప్రభలేప్రమాదం ఉందని కాలనీవాసులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే కార్పొరేటర్ జలమండలి అధికారులతో మాట్లాడి గల్పర్ యంత్రాన్ని తెప్పించి మ్యాన్‌హోళ్లను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో జలమండలి మేనేజరు రాజు, కాలనీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి ఉన్నారు.

## మహేశ్వరం నియోజకవర్గ బిఆర్‌ఎస్ ఆర్గనైజింగ్ ఇంఛార్జిగా పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి

**సరూర్‌నగర్, మే 23 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గ బిఆర్‌ఎస్ ఆర్గనైజింగ్ ఇంఛార్జిగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా యువ నేత పట్లోళ్ళ కార్తీక్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కార్తీక్‌రెడ్డికి కీలక బాధ్యతలు అప్పగిస్తూ నియోజకవర్గ పార్టీ కార్యనిర్వాహక బాధ్యునిగా నియమించి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ మార్గదర్శనంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ ఆదేశాల ప్రకారం నియోజకవర్గంలో బిఆర్‌ఎస్ పార్టీని క్షేత్ర స్థాయి నుండి అన్ని విభాగాలను పటిష్టం చేయాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్‌ఎస్ పార్టీ అదేశాలను శిరసావహించి తనపై ఉంచిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని యువ నేత కార్తీక్‌రెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గంలో కీలకమైన పార్టీ ఆర్గనైజింగ్ ఇంఛార్జి పదవి ఇవ్వడంపై ఆయన హర్షం వ్యక్తం కృతజ్ఞతలు తెలియజేస్తూ కెసిఆర్, కెటిఆర్, సబితా ఇంద్రారెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తానని వెల్లడించారు.